## మంగళగిరి

# డాన్ బోస్కో స్కూల్




## మన విద్యాలయం - మన ప్రేమాలయం

రచయిత : ఈపూరి రాజారత్నం

మంగళగిరి

# డాన్ బోస్కో స్కూల్



## మన విద్యాలయం - మన ప్రేమాలయం

రచయిత : ఈపూరి రాజారత్నం

by

EPURI RAJA RATNAM

M.A., mjmc (Ph.D.)

Cover Page Design & Edited by : EPURI RAJA SEKHAR

© SRI EPURI RAJA RATNAM

Year of Publication : December 2025

by ***EPURIS TV18 PUBLICATIONS***

& ***RAJA RATNAM TRUST***

Publishers:

***EPURIS TV18 PUBLICATIONS***

EPURI RAJA RATNAM

M.A., mjmc (Ph.D.)

Dr. No : 3-580, Ratna Bhavan, Makkevaripet,

Nowluru, Mangalagiri (Md), Amaravathi, Guntur (Dt),

Pin - 522 503, Andhra Pradesh, India.

Email : epurirajaratnam1975@gmail.com

Cell : 9390062078

Copies, available at :


***EPURIS TV18 PUBLICATIONS***

**Cell : 9390062078**

Printing & Binding : **SRI SAI GANESH PRINTERS**

**(Ande Samba) Guntur. Cell : 85550773676**

RAJA RATNAM TRUST
HOPE FOR ALL



# ముందు మాట

ఈపూరి రాజారత్నం గారు, సీనియర్ జర్నలిస్ట్ రాసిన డాన్‌బోస్కో స్కూల్ గురించిన పుస్తకాన్ని అభినందించడం నాకు ఆనందంగా ఉంది. ఈ తెలుగు మీడియం స్కూల్ 2025 డిసెంబర్‌లో స్వర్ణోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంలో, ఈ పుస్తకం పాఠకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మంగళగిరి పరిసర ప్రాంతాల్లో పాఠకులకు రాజారత్నంగారు బాగా పరిచయం ఉన్నవారు. 2023, 2024 సంవత్సరాల్లో జర్నలిజం మరియు జర్నలిస్టుల గురించి ఆయన రాసిన రెండు భాగాల పుస్తకాలు అందరి ప్రశంసలు పొందాయి.

ఇప్పుడు డాన్‌బోస్కో గురించిన పుస్తకం రాయడం తన బాధ్యతగా భావించారు. ఇందులో డాన్‌బోస్కో, డాన్‌బోస్కో తెలుగుమాధ్యమ పాఠశాల (యర్రబాలెం, మంగళగిరి), ఫాదర్ థామస్ చిన్నప్ప గారు (స్థాపకులు), అలాగే ఆయనకు బోధించిన గురువుల గురించి సంక్షిప్తంగా వివరించారు. ఈ పుస్తకంలోని వివరాలు ఆయన ఈ పాఠశాలలో పొందిన వ్యక్తిగత అనుభవాలే. ఆయనకు ఈ పాఠశాలపై ఉన్న అమోఘమైన ప్రేమ దీనిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ప్రక్కన ఉన్న ప్రజల జీవనాల్లో ఈ పాఠశాల తీసుకొచ్చిన మార్పులను ఆయన చూపించిన తీరు హృదయాన్ని హత్తుకుంటుంది. ముఖ్యంగా, మొదట ఈ పాఠశాల కోసం భావించబడిన దివ్యాంగ యువతకు ఇది ఎంతగానో ఉపయోగపడిందని వివరించడం ఎంతో భావోద్వేగంగా ఉంది.

ఈ సాహిత్య యత్నంలో రాజారత్నం గారికి నేను హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. పాఠకులకు ఈ పుస్తకం ఆసక్తికరమైన పఠనానందాన్ని అందిస్తుంది.

**ఫా. కె.ఎస్. జోసెఫ్,** SDB

రిటైర్డ్ హెడ్‌మాస్టర్



# ముందు మాట

1979-2012 మధ్య కాలంలో నేను డాన్‌బోస్కో పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా మరియు ప్రధానోపాధ్యాయురాలిగా పని చేశాను. ఈ క్రమంలో 1990 నుండి 2012వరకు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసి 2012లో ఉద్యోగ విరామం పొందాను. స్కూల్లో తొలినాళ్ళలో ఇక్కడ నేను, నాతోటి టీచర్లు పనిచేస్తున్నప్పుడు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పేద, దిగువ మధ్యతరగతి పిల్లలకు పాఠశాల ఉచిత అడ్మిషన్ ఇచ్చి వారికి చదువుకునే అవకాశం కల్పించింది. విద్యలో సేవాభావం మెండుగా వ్యాప్తి చేస్తున్న ఫాధర్ థామస్ గారి ఆశయాలలో మా టీచర్లు అందరూ ఇక్కడ విద్యార్థుల పట్ల చాలా బాధ్యతగా చదువు, క్రమశిక్షణ నేర్పించాం. ఈ కారణంగా ఎంతోమంది పేదలు పూర్తిస్థాయి ఉచిత విద్యను ఇక్కడ పొందారు. ఇక మా వద్ద చదువుకున్న విద్యార్థులుపై మేము చాలా శ్రద్ధ చూపేవాళ్ళం. పిల్లలు ఇంటికి వెళ్ళి స్కూల్లో విన్న పాఠాలు చదువుతారో..., లేదోనని, హోమ్ వర్క్ చేస్తారా... లేదా... వారిని కనిపెట్టి చూసేందుకు పనులకు వెళ్ళే తల్లిదండ్రులకు అవకాశం ఉండదేమోనని మా విద్యార్థులు పట్ల చాలా బాధ్యతగా ఉండేవాళ్ళం. పిల్లలకు విద్య, క్రమశిక్షణ, ఆత్మ స్థైర్యం, విలువలు, ప్రేమ, దయాగుణం, సంస్కారం వంటివి కూడా నేర్పడం చేసేవాళ్ళం.

ఇక డాన్‌బోస్కో పాఠశాల ప్రారంభమై గోల్డెన్ జూబ్లీ జరుపుకుంటున్న ఈ సందర్భం చాలా ఆనందంగా ఉంది. ఇప్పటి వరకు మన పాఠశాల పేరు ఎలా వుందో భవిష్యత్‌లో కూడా ఇలానే మరింత ఎదగాలి అని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం. అప్పట్లో ఇక్కడ పనిచేసిన

టీచర్లు ఒకరిద్దరు తప్ప అందరూ రిటైర్ అయ్యారు. మరి వారి స్థానంలో ఖాళీగా ఉన్న ఎయిడెడ్ పోస్టులు పూరించలేకపోయాం. మరి ప్రభుత్వం ఆ పోస్టులు భర్తీ చేస్తే చాలా మంచిదని అనుకుంటున్నాం. డాన్‌బోస్కో సంస్థ ఇప్పుడున్న పరిస్థితుల్లో తెలుగు మీడియం పాఠశాలను నడిపించడంలో యాజమాన్యం ఇబ్బందులు ఎదుర్కొంటుందని తెలిసింది. అలాగే ఇక్కడ చదువుకున్న పూర్వవిద్యార్థులు సహాయ-సహకారం లభిస్తుందని తెలుసుకోవడం జరిగింది.

ఇక మన పాఠశాల పూర్వ విద్యార్థి అయిన 1991-92 బ్యాచ్‌కి చెందిన ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్, రచయిత ఈపూరి రాజారత్నం మన పాఠశాల చరిత్ర, విధి- విధానాలు, ప్రత్యేకత అన్నింటినీ గమనంలో ఉంచుకుని, ఒక చిన్న పుస్తక రూపంలో తీసుకొస్తున్నాను టీచర్ గారు, పుస్తకానికి ముందుమాట మీరే రాయాలి అని అడిగినప్పుడు నాకు చాలా ఆనందం కలిగింది. మన రాజారత్నం వాళ్ళ అన్నయ్య, తమ్ముడు మరియు వారి పిల్లలకు కూడా మేము చదువు చెప్పాం. ఇలా మన విద్యార్థులు ఎవరైనా కలిసినప్పుడు ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయులు అందరూ ఇప్పుడు మేము ఉన్నతస్థానంలో ఉన్నామని మన విద్యార్థులు మాతో చెబుతుంటే మాకు ఎంతో ఆనందంగా ఉంటుంది.

ఇట్లు

**ఇన్యాసమ్మ టీచర్**

(రిటైర్డ్ హెచ్.ఎం)

డాన్‌బోస్కో ఎలిమెంటరీ పాఠశాల.



# ముందు మాట

వ్యక్తి నిర్మాణానికి, మానవ వికాసానికి, సమాజాభివృద్ధికి విద్య అనేది చాలా కీలక భూమిక పోషిస్తుంది. ఈ సమాజంలో ఏ రంగం అభివృద్ధి చెందాలన్నా ప్రధానంగా విద్యా వ్యవస్థ పటిష్టమై, మారుతున్న కాలానికి అనుగుణంగా మెరుగైన విద్యా విధానాల దిశగా అభివృద్ధి చెందాలి. అలాంటి విద్యా వ్యవస్థలలో విద్యార్థులు అందరూ విలువలతో, సామాజిక బాధ్యత కలిగిన విద్యార్థులుగా మన డాన్‌బోస్కో విద్యార్థులు మంచి విద్యను పొందారు.

సలేషియన్ గురువులచే పునీత డాన్‌బోస్కో గారి సదాశయమును నేరవేర్చగలుగుతుంది మన పాఠశాల. పాఠశాల పరిసర ప్రాంతాల పేద, అనాధ, వికలాంగ బాలల కోసం డాన్‌బోస్కో ఉన్నత పాఠశాల ఐదు దశబ్దాలు గా పనిచేస్తూ... నేడు స్వర్ణోత్సవ వేడుకలను జరుపుకోవడం చాలా చాలా ఆనందం. 50 సంవత్సరాలుగా వేలాది మంది విద్యార్థులకు సేవలందిస్తున్నది మన మంగళగిరి డాన్‌బోస్కో విద్యాలయం. ఈ అర్ధ శతాబ్దపు ప్రయాణంలో తన ఒడికి చేరిన విద్యార్థులను అక్షర అభ్యాసం నుండి వారిని ఉన్నతస్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దిన విధానంలో డాన్‌బోస్కో సంస్థలో పనిచేసిన చేస్తున్న ప్రతి ఒక్కరి కృషి ఉంది. సమిష్ఠి కృషితోనే ఈ ప్రయాణం ఇక్కడివరకు సాగింది

అలాగే సమాజాన్ని సంస్కరించే దిశగా సామాజిక అంశాలను రాస్తూ ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా మంచి గుర్తింపు కలిగిన మన డాన్‌బోస్కో పూర్వ విద్యార్థి రచయిత, ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ ఈపూరి రాజారత్నం గారు డాన్‌బోస్కో ఉన్నత పాఠశాల అభివృద్ధిపై,

పాఠశాల విద్యావిధానం, ఉపాధ్యాయుల మెరుగైన బోధనా విధానాలు, డాన్‌బోస్కో సంస్థ సేవా దృక్పథం వంటి ప్రతి విషయాన్ని కూర్చి రాసిన ఈ పుస్తకం ద్వారా అంచెలంచెలుగా ఎదిగిన పాఠశాల అభివృద్ధిపై మరియు అక్షరబుుషులైన ఉత్తమ ఉపాధ్యాయుల సేవాతత్పరతను గ్రహించి రాసిన ఈ పుస్తకం చాలా విలువైనదిగా చెప్పగలం. ఇక మన పాఠశాల స్వర్ణ జూబిలీ వేళ ఈ పుస్తకం అందుబాటులోకి రావడం మనందరం హర్షించదగిన ప్రత్యేక విషయం. మన డాన్‌బోస్కో పాఠశాలకు చెందిన రాజారత్నం గారికి మరోసారి అభినందనలు.

ఇట్లు

**వై. ఫాతిమా రాణి**

ప్రధానోపాధ్యాయిని

డాన్‌బోస్కో పాఠశాల

ఎర్రబాలెం, మంగళగిరి

RAJA RATNAM TRUST HOPE FOR ALL



# ముందు మాట

1991–92బ్యాచ్‌కి చెందిన విద్యార్థిగా మన డాన్‌బోస్కో పాఠశాల మరియు మా బ్యాచ్ మిత్రుల విషయంలో నా మిత్రులు అని చెప్పుకునేందుకు ఎల్లప్పుడు నేను గర్వపడుతూనే ఉంటాను. 81–82 విద్యా సంవత్సరం నుంచి పాఠశాలలో 1వ తరగతి చదువుతూ 91–92 చదువుల ప్రయాణంలో పాఠశాల మమ్మల్ని ప్రయోజకులను చేసింది. మా బ్యాచ్ తరపున పాఠశాల యాజమాన్యం, ఫాదర్స్–బ్రదర్స్, ప్రతి ఒక్క ఉపాధ్యాయులకు, ఇక్కడ చదువుకున్న ప్రతి విద్యార్థికి, పాఠశాలతో అనుబంధం ఉన్నవారందరికి మా బ్యాచ్ తరపున ధన్యవాదములు. డాన్‌బోస్కో పాఠశాల అనే పేరు వినిపిస్తే చాలు అక్కడ చదువుకున్న ప్రతి విద్యార్థి హృదయంలో నుండి పాజిటివ్ వైబ్రేషన్స్ విశాలంగా విస్తరిస్తాయి. ఇక మా బ్యాచ్ మిత్రులకు మన పాఠశాల అనగానే ప్రత్యేక అభిమానంతో స్నేహబంధానికి విలువ ఇస్తూ.... తమ మిత్రులకు ఎప్పుడు ఇబ్బందులు ఉన్నా స్నేహహస్తం అందించి మేము ఉన్నాం అని భరోసా ఇస్తున్న మా మిత్రులను అభినందిస్తూ వారికి ప్రత్యేక ధన్యవాదాలు.

ఇక మిత్రుడు రాజారత్నం ఈ డాన్‌బోస్కో పాఠశాల, ఉపాధ్యాయులు, ప్రత్యేకత వంటి అంశాలను అన్నింటినీ కలిపి ఒక పుస్తకం రూపంలో తీసుకురావడం మాకు చాలా ఆనందం కలిగించింది. రాజారత్నం రచనలు చాలా ప్రత్యేకం, జర్నలిజంలో మరింత ప్రత్యేకమైన వ్యక్తి. ఈ పుస్తకం చదువుతుంటే మంగళగిరి డాన్‌బోస్కో అంటే ఏమిటి. ఈ పాఠశాలను ఎందుకు ఒక గొప్ప పాఠశాల అని అంటారు అనే విషయాలను చక్కగా కళ్ళకు కట్టినట్లుగా రాయడం చాలా చాలా ప్రత్యేకం. మన అందరి ఆలోచనల్లో డాన్‌బోస్కో పాఠశాలపై ఎటువంటి అభిప్రాయాలను కలిగి ఉన్నామో అలాగే తన రచనాశైలితో ఈ పుస్తకాన్ని రచించి పాఠశాలకు, థామస్ ఫాధర్ గారికి, ఉపాధ్యాయులు అందరికి అక్షరాభిషేకం చేయడం జరిగింది. డాన్‌బోస్కో పాఠశాలలో చదువుకున్న ప్రతి విద్యార్థి తమ ఇంటిలో భద్రపరుచుకోదగిన ప్రత్యేక పుస్తకం ఇది అని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదనేది మా బ్యాచ్ నుండి ప్రతి ఒక్కరి అభిప్రాయంగా చెబుతున్నాం.

ఇట్లు

**షేక్ ఖుద్దుస్**

డాన్‌బోస్కో పాఠశాల, (1991–1992 బ్యాచ్)

**PRESIDENT**

E.RAJA RATNAM
CELL: 9390062078

**SECRATRY**

E.RAJA SEKHAR
CELL: 9393664098

**TREASURER**

M.JAHNAVI
CELL: 7013249487

**VICE PRESIDENT**

E.ANU RADHA
CELL: 9014747488

**MEMBERS**

R.PAVAN KUMAR
CELL: 7671012340


CH.RAMESH BABU
CELL: 9505127181


మేము చదువుకున్న కాలానికి ముందు రోజుల్లో పాఠశాలకు వెళ్ళాలి అంటే స్కూల్స్ చాలా దూరంగా ఉండేవి. బడికి వెళ్ళి చదువుకోవాలి అనే ఆలోచన మనకు ఉండేది కాదు. తల్లిదండ్రులు జీవన పరిస్థితులు ఏమంత మెరుగ్గాను ఉండేవి కాదు. చాలా కుటుంబాలలో తల్లిదండ్రులు కష్టపడి పని చేసుకుని వస్తేనే ఆ రోజు గడిచేది. అవును అదే సమయంలో మన ప్రాంతంలో దయామయుడు, పేదల పెన్నిధి థామస్ ఫాధర్ మన డాన్‌బోస్కో పాఠశాలను 2వ తేదీ ఆగష్టు 1976 సంవత్సరంలో ప్రారంభించారు. ఫాధర్ థామస్ కారణంగానే ఈ పాఠశాల పరిధిలో ఎంతోమంది విద్యార్థులు ప్రయోజకులుగా మారి ఇప్పుడు మెరుగైన జీవనం సాగిస్తున్నారు.

ఇకపోతే చదువు మనిషి కి ఆర్థిక స్థిరత్వం, సమాజంలో గౌరవం సంపాదించి పెడుతుంది, సక్రమమైన దారుల్లో నడిపిస్తూ మన ఎదుగుదలకు చాలా సహాయపడుతుంది. మెదడును చురుగ్గా ఉంచి, ఆలోచనా శక్తిని పెంచి మంచి వివేక వంతునిగా సమాజంలో ఒక మార్గదర్శిగా నిలబెడుతుంది. మరి ముఖ్యంగా ఆర్థిక భద్రత, సామాజిక గౌరవం, మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం వంటివి కల్పించి మనందరిని ఉత్తమ మార్గాలలో నడిపిస్తుంది. డాన్‌బోస్కో పాఠశాల, ఇక్కడి ఉపాధ్యాయులు అక్కడి విద్యార్థులను ఈ దిశగానే నడిపించారు, విద్యను బోధించారు. ఈ క్రమంలో చదువు మనకు మూడవ నేత్రంగా మారింది. ఈ నేత్రం వెలుగులు చూస్తూ మన జీవితాలలో మరింత వెలుగులు నింపింది.

ఈ పాఠశాల తెలుగు మీడియం ఇప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాట వాస్తవం. మంగళగిరి డాన్‌బోస్కో పాఠశాలను ఇప్పుడు నిలబెట్టుకోలేకపోతే ఈ చరిత్రకు చెదలుపట్టినట్లే, 50 ఏళ్ళలో ఎంతోమంది పేద పిల్లలు ఇక్కడ ఉచిత విద్యను పొందిన విధానం ఓ పెద్ద చరిత్ర, ఈ చరిత్ర మళ్ళీ విద్యాదానంలో జీవనాదం కావాలని కోరుకుంటూ ప్రభుత్వం ఈ పేదల పాఠశాలను ఆదుకోవాలని కోరుకుందాం.

**ఈపూరి రాజారత్నం**
MA, MJMC (Ph.D)
పూర్వ విద్యార్థి – సీనియర్ జర్నలిస్ట్
సెల్ : 9390062078



**"మంగళగిరి డాన్‌బోస్కో స్కూల్"**

వ్యవస్థాపకులు కీ॥శే॥ రెవ. ఫా. థామస్ చిన్నప్ప గారికి

**ఈ పుస్తకం అంకితం**

# 1. పునీత జాన్ బోస్కో, డాన్‌బోస్కో అంతర్జాతీయ సంస్థ

ప్రపంచ వ్యాప్తంగా మంగళగిరి డాన్‌బోస్కో ఘనత ఒక ఆలయానికి సమానమైన విద్యామూర్తి కథ ఇది. ప్రపంచ పటంలో పేదలకు ఆశ్రయం, అనాథలకు ఆదరణ, విద్యా వెలుగుకు చిరునామాగా నిలిచిన సంస్థల్లో డాన్‌బోస్కో పేరు శాశ్వత స్థానం సంపాదించింది. కానీ ఒక ప్రశ్న ఎప్పుడూ మనసునొక మూలలో మెదులుతూనే ఉంటుంది. ఈ మహత్తర ఉద్యమం ఎక్కడ ఆరంభమైంది? ఎవరి ఆలోచనలో జన్మించింది? అంతకంటే ముఖ్యంగా ప్రపంచంలోని ఎన్నో డాన్‌బోస్కోలలో మంగళగిరి డాన్‌బోస్కో ఎందుకు ప్రత్యేకం? అనేది, ఈ కథ ఆ ప్రశ్నలకు సమాధానమే కాదు ఒక గొప్ప సేవాగాధకు నిదర్శనము కూడా, జాన్‌బోస్కో అంటే ఒక మనిషి కాదు అది ఒక మానవతా ఉద్యమం. ఇటలీకి చెందిన సెయింట్ జాన్ బోస్కో గారి పేరు చెబితేనేం, ఆయన పని చెప్పుకుంటేనే ఏమో ఆయన స్ఫూర్తి ప్రపంచమంతా విస్తరించిన మహోన్నత జ్వాల అని చెప్పాలి. ఆయన అసలు పేరు శాన్ జియోవన్నీ మెల్చియోర్ బోస్కో, కానీ ప్రపంచం ఆయనను ప్రేమతో, గౌరవంతో డాన్‌బోస్కో అని పిలిచింది.

1815 ఆగస్టు 16న ఇటలీలోని పీడ్మాంట్ ప్రాంతంలోని చిన్న గ్రామం బెచ్చీలో జన్మించిన ఈ పునీతుడు, 1888 జనవరి 31న ఈ లోకాన్ని విడిచారు ఆయన వెలిగించిన ఎందరో జ్ఞానదీపాలు ఈ రోజు 180కి పైగా దేశాల్లో వేలాది పేదల భవిష్యత్తును ప్రకాశవంతం చేస్తున్నాయి. పేద పిల్లలకోసం ఆయన స్థాపించిన సంస్థ "సలేషియన్స్ ఆఫ్ డాన్‌బోస్కో" (SDB) ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా విద్య, సేవ, ఆరోగ్యం, అనాథ శరణాలయాలు, ఔత్సాహిక యువతకు నైపుణ్య శిక్షణ ఇలా అనేక రంగాల్లో ప్రకాశించే గొప్ప వారసత్వంగా నిలిచింది.

**మంగళగిరి డాన్‌బోస్కో జాన్ బోస్కో ఆశయాలకు అసలైన ఆత్మ**

ప్రపంచంలోని అనేక దేశాల్లో డాన్‌బోస్కో లు ఉన్నా జాన్ బోస్కో గారి ఆత్మను నిజంగా సాకారం చేసిన ప్రదేశం ఏదైనా ఉందంటే, అది మంగళగిరి డాన్‌బోస్కో అని ప్రత్యేక గుర్తింపును సాదించింది. నాకు తెలిసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇదే మొదటి డాన్‌బోస్కో అని చెప్పేవారు. అలాగే ఈ డాన్‌బోస్కో ప్రేమ్ నివాస్‌ని స్థాపించి తన జీవితాన్ని పేదపిల్లల కోసం అంకితం చేసిన ఫాదర్ థామస్ గారి సేవా గాథ దీనిని ప్రపంచ పటంలో ప్రత్యేక స్థాయికి చేర్చింది. అనాథలు, వికలాంగులు, ఆశ్రయం లేక పోయిన పిల్లలు, విద్య లేక భవిష్యత్తు చీకట్లో నడుస్తున్న చిన్నారులు, వారందరికీ వసతి, వైద్యం, విద్య, ప్రేమ, రక్షణ అన్నీ ఒకే చోట అవకాశం కల్పించారు ఫాధర్ థామస్ చిన్నప్ప.

**అది ఒక పాఠశాల కాదు ఒక జీవన ప్రేరణ కేంద్రం.**

ఇలాంటి సేవలు ఈశాన్య భారతదేశం, ఉత్తర రాష్ట్రాలు, ఆఫ్రికా, అమెరికా లాంటి అనేక దేశాల్లో కొన్నిచోట్ల మాత్రమే కనిపిస్తాయి. కానీ దక్షిణ భారతదేశంలో మంగళగిరి డాన్‌బోస్కో చేసిన సేవలకు సమానమైనది ఎక్కడా లేదనేది వినికిడి. అది ఈ సంస్థ యొక్క అత్యున్నత ఘనత.

**మదర్ థెరిసా కూడా ఆశ్చర్య పడిన సేవలు.**

ఫాదర్ థామస్ గారి సేవల పరమార్థాన్ని గుర్తించి 1982లో మదర్ థెరిసా స్వయంగా మంగళగిరి డాన్‌బోస్కోకు విచ్చేశారు. అక్కడ ఉన్న అనాథలు, వికలాంగులు, పేద చిన్నారుల సేవా విధానాన్ని చూస్తూ ఆదరాభిమానాలతో ఫాదర్ థామస్ గారిని అభినందించారు. మదర్ థెరిసా వంటి విశ్వమానవతా ప్రతీక సాక్షాత్తుగా వచ్చి ప్రశంసించడం అనేది ఈ డాన్‌బోస్కో యొక్క మహత్కార్యాలకు ప్రపంచం ఇచ్చిన అత్యున్నత గౌరవం మరియు సర్టిఫికేట్.

## తెలుగు రాష్ట్రాల్లో డాన్‌బోస్కో ప్రభావం

పునీత జాన్‌బోస్కోగారి ఆశయాలతో ప్రేరేపితమైన "సలేషియన్స్ ఆఫ్ డాన్‌బోస్కో సంస్థ" మన తెలుగు రాష్ట్రాల్లో కూడా చాలా విశేష సేవలకు మార్గం చూపింది. ప్రధాన నగరాల్లో డాన్‌బోస్కో ఇంగ్లీషు మీడియం పాఠశాలలు, గుంటూరు నగరంలో గల డాన్‌బోస్కోలో ప్రపంచ స్థాయి ప్రింటింగ్ ప్రెస్ కలిగివుంది. మరికొన్ని ఎస్.డి.బి, సంస్థల్లో పేదలకు వైద్య, వసతి, వృత్తి నైపుణ్య శిక్షణ సేవలు అందించడం జరుగుతున్నప్పటికి, వీటికంటే ముందు, వీటికన్నా ఎక్కువగా మంగళగిరి డాన్‌బోస్కో సంవత్సరాల తరబడి చేసిన నిస్వార్థ సేవలు ఈ సంస్థ గుండె చప్పుడుగా నిలిచాయి.

## మంగళగిరి డాన్‌బోస్కో అక్షర చరిత్ర, సేవలకు ప్రతిరూపం

ప్రపంచ దేశాల్లో ఉన్న వేలాది డాన్‌బోస్కోల్లోనూ మన మంగళగిరి డాన్‌బోస్కోకు ప్రత్యేక స్థానం ఉంది. దానికి కారణం ఇదీ, ఎందుకంటే ఇక్కడ విద్య మాత్రమే కాదు, అక్కడి విద్యార్థులకు చిన్ననాటి నుండే మానవత్వం కూడా బోధించబడింది. ఇక్కడ పాఠాలు మాత్రమే కాదు ఎందరో జీవిత భవిష్యత్తులు నిర్మించబడ్డాయి. ఇంకా ఇక్కడ ప్రేమ మాత్రమే కాదు, ఎందరో జీవితాలు మారాయి వెలుగును చూశాయి. ప్రపంచం జాన్‌బోస్కో అనే మహనీయుడికి మహత్తరం శిరస్సు వంచుతుంది. తెలుగు నేల మాత్రం ఫాదర్ థామస్ గారికి రెండుసార్లు తలవంచుతుంది. అంతటి గొప్ప మనిషి. ఒకసారి సేవకోసం, మరోసారి ఆయన నిర్మించిన మంగళగిరి డాన్‌బోస్కో కోసం మనం రెండుసార్లుగా గుర్తుచేసుకోవడం ఫాథర్ థామస్‌లోని మంచితనం. ఇదే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న డాన్‌బోస్కోలలో "మంగళగిరి డాన్‌బోస్కో ఘనత". మంగళగిరి డాన్‌బోస్కో అంటేనే మనందరం ఎంతగానో గర్వించదగిన, నిజాయితీతో నిండిన, చరిత్రలో చిరస్థాయిగా నిలిచే సేవాగాథను కలిగి ఉంది.

## ౨. మంగళగిరి నేలపై ఫాధర్ థామస్ గుర్తుగా నిలిచిన చారిత్రిక డాన్‌బోస్కో

మంగళగిరి శివార్లలోని ఎర్రబాలెం నేడు ఈ పేరు వినగానే వేలాది మంది హృదయాల్లో ఒకే చిత్రం మెదులుతుంది. అదే డాన్‌బోస్కో ప్రేమ్ నివాస్. అనాథలు, వికలాంగులు, పేద పిల్లలు వీరి జీవితంలో వెలుగు చూసే అవకాశం లేకుండానే చీకటిలో మిగిలిపోయే వారందరికీ ఆశాకిరణంగా నిలిచిన పుణ్య స్థలం మంగళగిరి డాన్‌బోస్కో. ఈ ప్రేమ్ నివాస్ కేవలం ఒక పాఠశాల కాదు. ఇది సేవ, ప్రేమ, దయ అనే మూడు మూల స్తంభాలపై నిర్మించబడిన ఒక మరుపురాని కేంద్రం. "సలేషియన్స్ ఆఫ్ డాన్‌బోస్కో" ప్రపంచాన్ని వెలిగించిన సంస్థ.

మంగళగిరి డాన్‌బోస్కోను నడిపేది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకొని పనిచేస్తున్న 'సలే షియన్స్ ఆఫ్ డాన్‌బోస్కో' ఈ సంస్థ ప్రభావం ఒక్క రాష్ట్రానికి పరిమితం కాదు. ప్రపంచంలోని 180 దేశాల్లో సేవలను విస్తరించుకున్న అద్భుతమైన అంతర్జాతీయ సంస్థ. ఆ గొప్ప వారసత్వంలో ఒక విలువైన అధ్యాయం మన మంగళగిరి డాన్‌బోస్కో ప్రేమ్ నివాస్. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న డాన్‌బోస్కో కేంద్రాలలో మంగళగిరి పేరు ఎల్లప్పుడూ గౌరవంగా వినిపిస్తూనే ఉంది. ఫాదర్ థామస్ చిన్నప్ప ఈ ప్రేమ గృహానికి పునాదులు వేసిన గొప్ప మహనీయుడు

1976లో ఎర్రబాలెం శివార్లలో చిన్న పాకలతో మొదలైన ఈ సేవా యజ్ఞం వెనుక ఉన్న మహోన్నత హృదయం ఫాదర్ థామస్ చిన్నప్పది. అనాథలు, విభిన్న సామర్థ్యాలతో జన్మించిన పిల్లలు జీవితం వైపు చూసే అవకాశం కూడా లేకుండానే మసకబారుతున్న రోజులలో, ఆ పిల్లలకు ఓ ముద్దుల తండ్రిలా నిలిచి వారికి ప్రేమ, ఆత్మ విశ్వాసం, ఆపన్నహస్తం అన్నీ ఇచ్చిన వ్యక్తి థామస్ ఫాధర్.

ఫాధర్ థామస్ ఇక్కడ ఉన్నంతకాలం ఈ ప్రేమ్ నివాస్‌లో చదివిన పిల్లల్లో 97% మంది అనాథలు, వికలాంగులు, పేద కుటుంబాల వారే. వారు పొందిన ప్రేమ, దయ, ఆదరణ మాటల్లో చెప్పలేనంత గొప్పదిగా ఉండేది.

మొత్తం 15ఎకరాల ప్రాంగణంలో ఒక చిన్న గ్రామమే విద్యాలయం అయింది. ఎందరో దాతల హృదయస్పందనలతో మంగళగిరి డాన్‌బోస్కో ప్రేమ్‌నివాస్ 15ఎకరాల విస్తారమైన ప్రాంగణంలో అభివృద్ధి చెందింది. 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు పాఠశాల ప్రత్యేక విద్యార్థుల కోసం ఫిజియోథెరపీ కేంద్రం. కృత్రిమ పాదాల తయారీ కేంద్రం, ఆవులు, సీమ పందులు, కోళ్ళు, బాతులు, చేపల కోసం ప్రత్యేక పాండ్ మరియు బొప్పాయి, మామిడి తోటలు, వేరు శనగ, కంద, కందులు వంటి పంటల సాగు మరియు ఒక విద్యా సంస్థగా మాత్రమే కాకుండా, ఒక వ్యవసాయ క్షేత్రంలా, ఒక కుటుంబంలా, ఒక ఆశ్రమంలా ఉండేది. ఈ సంపద అంతా 150కి పైగా ఉన్న అనాధ–వైకల్యం లోపం ఉన్నవారికి పోషకాహార లోపం లేకుండా వ్యవసాయ సంపదను ఉత్పత్తి చేసి వారికి అందించడమే థామస్ ఫాధర్ ఉద్దేశం.

ఎప్పటికి మర్చిపోలేని గోధుమ అన్నం ఎన్టీఆర్ కాలంలో మధ్యాహ్న భోజన సదుపాయం, పేద విద్యార్థులు ఆరోగ్యంగా పెరగాలని హాస్టల్ నుండి తీసుకున్న నిర్ణయంలో ప్రతి నెలకు ఒక్క రూపాయి చెల్లించి మధ్యాహ్నం గోధుమ అన్నం అందుకునే వ్యవస్థ.

అలాగే ఎన్టీఆర్ గారి ముఖ్యమంత్రి పదవిలో ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకంలో, తెల్లని అన్నం, రుచికరమైన సాంబారు 80వ దశకంలో నాడు చదివిన విద్యార్థులు గుర్తు చేసుకుంటే... ఆ జ్ఞాపకాలు కళ్లలో నీళ్ళు తిరిగినా అంత కమ్మని భోజనం ప్రతి మధ్యాహ్నం భుజించే అదృష్టంతో కళ్ళు నిజంగానే మెరిసిపోయేవి.

ఆ రోజుల్లో ఇంటర్– లాకింగ్ పాకలతో, చిన్న తరగతి గదులతో ఉన్న పాఠశాల అక్కడే ఎన్టీఆర్ భోజన పథకంలో భోజనం చేసేవాళ్ళం. ఇప్పుడు విద్యార్థులకు ఈ విషయం చెబితేగానీ తెలుసుకునే అవకాశం లేదు. ఇప్పుడు కాలానుగుణంగా ఆధునిక సౌకర్యాలతో కూడిన సెంట్రల్ సిలబస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్గా మారింది. ఒకప్పుడు వేల మందికి వెలుగు ఇచ్చిన తెలుగు మీడియం పాఠశాల ఈరోజు అనేక ఇబ్బందులతో భారంగా సాగుతోందని చెప్పుకోవడం నిజంగా బాధాకరం.

**మదర్ థెరిసా సందర్శన డాన్‌బోస్కోకి దక్కిన అరుదైన గౌరవం**

ఈ పాఠశాల చరిత్రలో అతి విశిష్టమైన రోజు 1982 డిసెంబర్. నోబెల్ శాంతి బహుమతి అందుకున్న వెంటనే మదర్ థెరిసా స్వయంగా మంగళగిరి డాన్‌బోస్కో ప్రేమ్ నివాస్‌ను సందర్శించారు. అది కేవలం ఒక సందర్శన మాత్రమే కాదు. అనాథలు, వికలాంగులైన పిల్లల చేతుల్లో ప్రేమను, ఆశీర్వాదాలను ఉంచిన పవిత్ర స్పర్శ. ఆమె పాదధూళి తగిలిన స్థలంగా డాన్‌బోస్కో ప్రేమ్ నివాస్ ఆ తరువాత నుండి మరింత వెలుగులు విరజిమ్మింది. సేవారంగంలో ఇది ఒక ధృవతారగా నిలిచింది.



1982 డిసెంబర్ మంగళగిరి డాన్‌బోస్కో ప్రేమ్‌నివాస్‌ను సందర్శించిన మదర్ థెరిస్సాతో ఆనాటి విద్యార్థులు

# 3. డాన్‌బోస్కో ప్రేమ్ నివాస్ విద్యాసేవలో అలుపెరుగని విద్యాలయం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గుంటూరు జిల్లా, మంగళగిరి మండలంలోని ఎర్రబాలెం గ్రామ శివారు ఈ ప్రశాంత ప్రాంతం 1976లో ఓ మహత్తరమైన సేవా యజ్ఞాన్ని ఆరంభించిన చారిత్రాత్మకస్థలంగా నిలిచింది. అదే డాన్‌బోస్కో ప్రేమ్ నివాస్. తల్లిదండ్రులు లేని అనాథలు, దిక్కులేని వికలాంగులు జీవితం మొదలుకాక ముందే ముగిసినట్టుగా కనిపించిన వారి జీవితాల్లో వెలుతురు నింపడానికి ఫాదర్ థామస్ చిన్నప్ప ఓ దేవాలయం లాంటి ఆశ్రయం నిర్మించారు. చిన్న పూరిపాక నుంచి ప్రారంభమైన మహోన్నత ప్రయాణం ఈ విద్యాలయం అదో ప్రేమాలయం. అప్పట్లో విజయవాడ-గుంటూరు మధ్య మంగళగిరి ఓ చిన్నపట్టణం మాత్రమే. విజయవాడ నుండి మంగళగిరి వైపు వచ్చేవారు బ్రిడ్జ్ పైకి ఎక్కుతుండగా కుడివైపు పెద్ద మైదానం మధ్య కనిపించే కొన్ని ప్రశాంతమైన నిర్మాణాలే డాన్‌బోస్కో ప్రేమ్ నివాస్.

ఆ రోజుల్లో పూరిపాకలతో కట్టిన చిన్నగదులే పిల్లల కలలకు మొదటి చిరునామా. వాటిల్లోనే మొదటి పాఠాలు వాటిల్లోనే మొదటి ఆశలు వాటిల్లోనే మొదటి చదువుల వెలుగు.

అనాథల కోసం స్థాపించిన ఆశ్రయం, చుట్టు ప్రక్కల గ్రామాల పిల్లలకు కూడా ఆవాసం అయ్యింది. ఆ కాలంలో చుట్టుపక్కల గ్రామాల పిల్లలకు చదువు అందుబాటులో లేదు. స్కూల్‌లు ఉన్నా దూరం, రవాణా లేకపోవడం, పేదరికం ఇవన్నీ కలసి చదువు ఒక కలలా మారిపోయేది. ఈ పరిస్థితిని అర్థం చేసుకున్న గ్రామస్తులు తమ పిల్లలను కూడా ఈ ప్రేమ్ నివాస్‌లో చదివేలా అనుమతించాలని ఫాదర్ థామస్‌ను కోరారు. మనసు మంచితనం ఉన్న చోటే దేవుని సేవ ఉంటుంది అన్నట్లు ఫాదర్ థామస్ స్థానిక గ్రామాల పిల్లల పరిస్థితి గ్రహించి, పేద కుటుంబాల

విద్యార్ధులకు ఉచితంగా చదువుకునే అవకాశాలు కల్పించారు. అది ఒక పెద్ద నిర్ణయం. అది వేల కుటుంబాల జీవితాలను మార్చిన నిర్ణయం. అక్కడ భవనాలే కాదు, పిల్లల భవిష్యత్తుల్ని నిర్మించారు ఫాదర్ థామస్, మొదట చిన్న పాకలతో ప్రారంభించిన విద్యా సేవకు తరువాత మెరుగైన భవనాలు జతయ్యాయి. అనాధ పిల్లలు, వికలాంగులు, పేద విద్యార్ధుల కోసం వసతి, చదువు, మంచి వాతావరణం ప్రతి విషయం క్రమంగా రూపుదిద్దుకుంది.

**ప్రాథమికోన్నత పాఠశాల అనంతరం**

తర్వాత పై తరగతుల కోసం కొత్త గదులు, 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు బోధన. అన్నీ ప్రేమతోనే, సేవా భావంతోనే... అప్పట్లో ఆడపిల్లలకు 5వ తరగతి వరకు, మగపిల్లలకు 7వ తరగతి వరకు విద్య పూర్తిగా ఉచితం. 8వ నుండి 10వ తరగతుల వరకు కూడా నామమాత్రపు ఫీజులు మాత్రమే. ఆ ఫీజులు కూడా చాలామందికి మాఫీ చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇక్కడ చదివిన పిల్లలు సమాజానికి నిలువుటద్దాలుగా నిలిచారు. డాన్‌బోస్కో ప్రేమ్ నివాస్‌లో చదువుకున్నవారి జాబితా చూడండి.

1. **అనాధలు**
2. **వికలాంగులు**
3. **రోజూ కూలికి వెళ్లే వారి పిల్లలు**
4. **చిన్నచిన్న వ్యాపారాల కుటుంబాల పిల్లలు**
5. **ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు**
6. **ఇతర పాఠశాలల టీచర్ల పిల్లలు**

పేద, నిరుపేద, మధ్య తరగతి అందరికీ సమానంగా నాణ్యమైన విద్య ఇచ్చిన పాఠశాల ఇది. సీటు కోసం పోటీ ఒకటవ తరగతికే రికమండేషన్ల వరదపోటుగా ఉండేది. డాన్‌బోస్కోలో ఒకటవ తరగతి

సీటు దొరకడం అంటే ఒక పెద్ద అదృష్టం. ఎమ్మెల్యేలు, ఎం.ఈ.ఓ.లు, డాక్టర్లు, టీచర్లు, ఎవరి రికమండేషన్లు పెద్దగా పనిచేసేవి కావు. చివరికి ఎంపిక అయ్యేది నిజంగానే చదువుకోలేని పేద విద్యార్థులకు మాత్రమే సీటు దక్కేది. ఇది పాఠశాల యొక్క అసలైన మహిమ.

ఎర్రబాలెం నేలపై వెలిగిన ఒక సద్భావన దీపంగా వెలుగుతుంది. డాన్‌బోస్కో ప్రేమ్‌నివాస్ ఒక పాఠశాల మాత్రమే కాదు– అది వేలాది కుటుంబాల నమ్మకం. అది పేదపిల్లలకు ఫాదర్ థామస్ ఇచ్చిన బంగారు అవకాశము. ఫాదర్ థామస్ చిన్నప్ప నిస్వార్థ సేవకు అతిపెద్ద సాక్ష్యం. ఈ ప్రేమ్ నివాస్ నుంచి వెలువడిన ప్రతి విద్యార్థి, తన కుటుంబాన్ని, తన గ్రామాన్ని, ఈ నేలను గర్వపడేలా చేస్తున్నారు ఈ రోజున. ఇది ఫాధర్ థామస్ సేవాగుణాన్ని తెలియజేస్తే, ఎన్నో కుటుంబాలకు రెండు తరాలకు జీవితమిచ్చి మూడవతరానికి కూడా విద్యాబుద్ధులు నేర్పిస్తుంది. చిన్న పాకల నుంచి ప్రారంభమైన ఈ మహోద్యమం, ఇవాళ ఒక తరం కాదు, రెండు, మూడు తరాల భవిష్యత్తులను తీర్చిదిద్దింది. ఈ విధానం ఇంకా కొనసాగుతూనే ఉంది.



# 4. అక్షరాలు నేర్పిన మా టీచరమ్మలకు పాదాభివందనం

**మ**నిషి జీవితాన్ని మార్చేది తల్లి ఒక్కరే కాదు, చేతులు పట్టి అక్షరాలు రాయించిన ప్రతి టీచరమ్మ కూడా మరొక తల్లేకదా. ఈ సమాజానికి నాగరికతను, జ్ఞానాన్ని, అక్షర పట్టును అందించేది నారీశక్తి. మనం చదువుకున్న డాన్‌బోస్కో పాఠశాలలో ఈ నారీశక్తి అందించిన ప్రాథమిక విద్య నేటి మా జీవితాలకు అతి బలమైన పునాది అని తప్పకుండా చెప్పుకోవాలి. అక్కడ టీచర్లు కేవలం పాఠాలు మాత్రమే మనకు చెప్పలేదు. తల్లి ప్రేమతో శిక్షణ, తండ్రి రక్షణతో క్రమశిక్షణ అలాగే గురువు ఆశీస్సులతో జ్ఞానం వారు మనకు ఇచ్చారు. అందుకే ఆ పాఠశాలలో చదువుకున్న ప్రతి విద్యార్థి మానసికంగా, శారీరకంగా బలంగా, జీవన విధానంలో క్రమబద్ధంగా ఎదిగాడనేది అక్షర సత్యం.

ఈ రోజు మనం ఎందుకు ఆ టీచరమ్మల పాదాలు పట్టి నమస్కరించాలి అంటే..., కొన్ని పాఠశాలల్లో ఒక టీచర్‌కు రెండేసి సబ్జెక్టులు బోధించే దుస్థితి కనిపిస్తున్నా, మన డాన్‌బోస్కో పాఠశాలలో మాత్రం అక్షరం పట్టించటం మొదలుకొని వాఖ్య నిర్మాణం వరకూ, పదం రాయటం నుంచి కథనం రాయించే స్థాయి వరకూ, ఒక్కొక్క ప్రత్యేక విధానంలో ప్రేమతో మమ్మల్ని తీర్చిదిద్దారు. పాలబుగ్గల చిన్నారులమైన మమ్మల్ని, అమ్మా అని తల్లులను, తండ్రిని వెంబడించే వయసులోనే, మీ వద్దకు బడికి వచ్చినప్పుడు మీరు మాకు అక్షర దేవతలై, మమ్మల్ని విద్యావంతులుగా, ఆలోచనాశీలురుగా, బాధ్యతగల వ్యక్తులుగా తీర్చిదిద్దారు. ఈ రుణం ఎన్నిజన్మలు వచ్చినా తీర్చుకోలేనిది.

**(1) అమ్మ సరోజనమ్మ**

చల్లని మనసు వెన్నను మించిన ఆదరాభి మానాలు మీవి, అల్లరి పిల్లల చేతులను పట్టుకుని "అ, ఆ" అంటూ అక్షరాలు దిద్దించిన మొదటి తల్లి మీరు మాకు, బొమ్మలు చూపిస్తూ పదాలు పలికింపజేసిన మా తొలి

గురువు మీరే కదమ్మా..., ఈ రోజు మీరు మా మధ్య లేకున్నా మాకు మీరు నేర్పిన ప్రతి అక్షరంతో మీరే మా ముందున్నారు అన్న భావనను కలిగిస్తోంది. అమ్మా మీకు మా పాదాభివందనం. మీరు నేర్పిన అక్షరాలతోనే మేము మీకు ఈ రోజున అక్షర నీరాజనం పలుకుతున్నాం.

**(2) నాగ మల్లేశ్వరమ్మ**

సరోజనమ్మ చూపిన అక్షరబాటలో నడుస్తున్న మాకు గుణింతాల నుంచి పదాల నిర్మాణం వరకూ తెలుగు భాషలో ఎన్నో వాఖ్యాల సౌందర్యం మాకు పరిచయం చేసిన అమ్మ మీరు. మేము ఈ రోజు మాట్లాడే ప్రతి అర్ధవంతమైన పదంలో తప్పులు లేకుండా రాసే ప్రతివాఖ్యలో మీరు చూపిన దారినిండుగా కనిపిస్తుంది. తెలుగుభాష తియ్యదనం రుచి చూపారు కదమ్మా. ఈ వేళ మా నుండి మీకు అక్షర సుమాంజలి.

**(3) ఇన్యాసమ్మ**

తెలుగుభాషను మాకు నేర్పించే క్రమంలో తెలుగు భాషలో వాఖ్య నిర్మాణానికి తెలుగు పదాలను ఎలా సమకూర్చాలి అని మా చేత కాపీ రైటింగ్ చేయించి  వాఖ్య నిర్మాణంపై శిక్షణ ఇచ్చారు. అలాగే ఒక వాఖ్యం ఎక్కడ మొదల వ్వాలి, ఎక్కడ కామా, ఎక్కడ ఫుల్ స్టాప్ అన్నది మాకు జ్ఞానం అందించింది మీరే. భాష అంటే కేవలం పదాలు కాదు, అదొక ఆలోచన విధానం అని మాకు చెప్పిన తొలి వ్యక్తి మీరు. అలాగే "ఉపాధ్యాయులే జాతి నిర్మాతలు" అనే వాఖ్యానికి అర్ధం మీ వల్లే తెలిసింది. అమ్మా మాకు మీ పాదాలకు మా సాష్టాంగ నమస్సులు.

**(4) జానకీ దేవమ్మ**

అమ్మా మీరు తెలుగు టీచర్ కాకున్నా, తెలుగు నేర్పిన మా ముగ్గురు అక్షర దేవతల వల్ల మీ హిందీ క్లాస్ కూడా మాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగింది. హిందీ అక్షరాల నుంచి పదాల వరకూ, మీలోని ఓర్పు, శ్రద్ధ ఇప్పటికీ మాకు గుర్తుంటాయి. తెలుగు తెలుసుకుంటే, హిందీ నేర్చుకోవడం ఈజీగా ఉంటుందని, హిందీ భాషను, హిందీ అక్షరాలను

నేర్చుకోవడం తేలిక అని హిందీ అక్షరాల ఆకారాన్ని చూసి వికారానికి గురైన మాలో ధైర్యం నింపారు. అందుకే మీకు అచ్చ తెలుగులో అక్షర ప్రణామములు, ఇక హిందీలో మా అందరి నుండి మీకు ఈ రోజున ఓ...మా...,తుఝే సలామ్ అని చెబుతున్నాం.

**(5) కుసుమ కుమారమ్మ**

తెలుగు భాష అంటే ఏమిటో.... తెలుగుభాష మన మాతృభాష అనిచెప్పి దాని గొప్పతనం మాకు వివరించి భాషపై పట్టు సాధించేలా మమ్మల్ని తీర్చిదిద్దారు. మీరు మాకు మహాగురువులు. తెలుగుభాషా పాఠ్య అంశాలలో వచ్చు సంధులు, సమాసాలు, వ్యాసరచనలు, పద్య-గద్య అంశాలు, పద్యం యొక్క భావం, భావవ్యాఖ్యలు, వాటి అర్థం ఎలా గ్రహించాలి వంటి విషయాలతో పాటు తెలుగు గ్రామర్ భోధించుటలో చాలా ప్రత్యేకత ఉండేది. జీవితంలో ఈ తెలుగుభాష ఏ స్థాయిలో ప్రభావం చూపుతుందో మాకు స్పష్టంగా అర్థమైందంటే అది మీ వల్లే. ఈ రోజు నేను ఒక జర్నలిస్ట్‌గా నిలబడగలగటం, పదునైనపదాలు వాడటం, వివరణాత్మక కథనాలు రాయటం, సమాజ చైతన్యాన్నిపెంచే రీతిలో కలం నడపటం ఈ అంతా మీరు నేర్పిన అక్షరాలే నాకు ఇచ్చిన ఆయుధం.

**గురువు రుణం ఎందుకు తీర్చలేమంటే**

తల్లిదండ్రుల రుణం కొంతైనా తీర్చుకోవచ్చు. కానీ గురువు రుణం ఎన్నటికీ తీరేది కాదు. ఎందుకంటే 'గురువు' అనే పదంలోనే వెలుగుంది. ఇక్కడ చూడండి.

"గు" అంటే 'గుహ' ఈ పదాన్ని పరిశీలిస్తే గుహ లోపల చీకటి ఎక్కువగా ఉంటుంది "రు" అంటే 'వెలుతురు'

అజ్ఞాన చీకటిని తొలగించి జ్ఞానవేళ్లను వెలిగించేవారు గురువులు. మరి అలాంటి అమ్మలను ఒకచోటికి చేర్చి వేలాది పిల్లలకు ఉచిత విద్య అందించిన ఫాదర్ థామస్ గారి సేవలను కూడా ఇదే సందర్భంలో గౌరవంగా స్మరిస్తూ మా అక్షర దేవతలందరికీ పాదాభివందనాలు.

# 5. మన డాన్‌బోస్కో మన బాల్యం- మన ఊపిరి, మరుపురాని గుర్తులు

**మ**న డాన్‌బోస్కో పాఠశాల పేరు విన్నా మనలో ఎక్కడో ఓ మూల ఇప్పటికీ మనదేహం పులకరిస్తుంది. ఆ పాఠశాల మనకు ఇచ్చిన జ్ఞాపకాలు వయసు పెరగదు, కాలం ఎప్పటికి దాటిపోదు అనిపిస్తోంది. 2022లో మనమంతా  పూర్వ విద్యార్థులం ఒక్కచోట చేరినప్పుడు అందరి కళ్లలో మెరిసింది ఆ ఓ చిన్నప్పటి వెలుగు. మిత్రులారా అదీ వెలసిపోయిన జ్ఞాపకం కాదు. మన హృదయంలో శాశ్వతంగా నిలిచిన బంగారు గుర్తులు కదూ...

ఇప్పుడు తిరిగి 50 ఏళ్ల గోల్డెన్ జూబ్లీ వేడుకలు జరుపుకునే సమయం రాగానే, ఆ రోజు మన బాల్యం మళ్లీ బుగ్గలపై చిరునవ్వులా చేరి "రా ఏనాడో వేచిన సమయం మరోసారి మన బాల్యపు అల్లరి, చిలిపి, సరదా-సంతోషాలను తలుచుకుని మరీ గిలిగింతలు పెట్టుకుని హాయిగా నవ్వుకుందాం అని పిలుస్తోంది". అవును రావురా మళ్ళీ అలాంటి రోజులు. జీవితంలో ఒక్కసారి మాత్రమే వస్తాయి.అర్థం చేసుకోండి.

అందుకే అందరూ ఒకే మాట చెబుతున్నారు. "మన పాఠశాలను మన బాల్యాన్ని మనమే వచ్చి చూసేద్దాం."పాఠశాల గేటు దగ్గర నిలబడ్డ మన జ్ఞాపకాలు, మన డాన్‌బోస్కో గేటు దగ్గర ఆగి లోపలికి ఒకసారి చూసినా అప్పుడు మనకు మనసులో తట్టేది మన బాల్యమేగా...., నీ బాల్యాన్ని నీవు ఒక్కసారి కలిసిపో....కొన్నాళ్ళపాటు నీవు కొత్త హుషారులో ఉంటావు. మానసిక ప్రశాంతత పొందుతావు. దాని విలువ ఎంత డబ్బున్న పొందేదికాదు, ఏ మాత్రం మళ్ళీ తిరిగివచ్చేది అంతకన్నా కాదు. మునుపు స్కూల్‌కి వెళ్తుంటే హెడ్‌మాస్టర్ లూర్దురాజు గారు ఆఫీసు ముందు నిలబడి ఉండేవారు. మనం వారి దగ్గరికి వెళ్లేటప్పుడల్లా గుండెల్లో అలజడి కొంచెం భయం కొంచెం వినయం. పాదాలు శుభ్రంగా ఉన్నాయా? ప్యాంట్ ఇస్త్రీ అయ్యిందా? జుట్టులో నూనె వేసుకున్నామా?ఆయన వేసే మొట్టికాయలు!

ఆ ఉప్పొంగే రోజులు,ఆ చిన్నపాటి భయం ఇవి ఇప్పుడు మనలో తీపిగా నవ్వించే గుర్తులుగా ఉన్నాయి కదా దోస్త్.

**అంతా పేదరికం అయినా మనసంతా ప్రేమే.**

రూపాయి పౌష్టికాహార పథకం మన బాల్యంలో ఎంతటి కరుణను చూపిందో! కదా వేడివేడిగా బంగారు రంగులో మెరిసే గోధుమ అన్నం అక్కడ తినేముందు పెద్ద డబరాలో మరుగుతున్న సాంబారు అవి తిన్న ఆ రోజుల్ని ఎవరు మరిచిపోగలరు? జైన మతస్తులు, మార్వాడీలు వారి పండుగరోజుల్లో తెచ్చిన యాపిల్ పండ్లు బిస్కెట్ ప్యాకెట్స్, హాస్టల్లో ప్రత్యేకంగా తయారు చేసిన పసుపు తీపిహల్వా ఆ ప్రత్యేకమైన రుచి చాలా బాగుండేవి. ఆ జ్ఞాపకం ఈరోజు కూడా మన మదిలో కరుగుతుంది.

**అసెంబ్లీ మన చిన్నపాటి రాజకీయ, హెూదాల సభ.**

పాఠశాల అసెంబ్లీ వైపు వెళ్ళే మనం టైం అయ్యింది, సమయం లేదంటూ గ్రౌండ్‌లో జరిగే అసెంబ్లీకి నడుస్తూ ఓరే ఎమ్మెల్యే, మేడమ్‌కి స్పీచ్ రెడీ చేశావా? అంటూ ఒకరినొకరం ఆటపట్టించుకునే రోజులే నిజంగా పండుగలా ఉండేవి. అసెంబ్లీలో చిన్న చిన్న ప్రసంగాలు చేస్తూ పెద్ద పెద్ద రాజకీయ నాయకుల్లా టీచర్లకు కనబడకుండా ఫోజులు కొట్టేవాళ్ళం కదా.

మన మాటకారితనం, మన ఆత్మవిశ్వాసం, అప్పుడు మొగ్గగా మొదలై నేడు మనకు బలమైన ఆదారం అయ్యాయి. మనకు అవి రంగులు కాదు మన క్రమశిక్షణ, భాధ్యతకు ప్రత్యేక జట్లు రెడ్, గ్రీన్, ఎల్లో, బ్లూ, బ్రౌన్ టీమ్స్ వాటికి పాయింట్స్ ప్లస్, మైనస్‌లు వారం చివరలో ఏ టీమ్ జెండా ఎగురుతుందో అని ఎదురుచూడడం మన ఉత్సాహానికి, మన క్రమశిక్షణకి అదే పునాది. స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే వచ్చేసరికి ఏ టీమ్ డ్రిల్ బాగా చేస్తుందో అని గుండెల్లోనే పోటీలు పెట్టుకున్న రోజులు ఇవే కదా.

**మన పాఠశాల నిజమైన ఒలింపిక్ గ్రామం**

మనం ప్రతి ఒక్కరం ఏదో ఒక క్రీడలో ఓ ఒలింపిక్ ప్లేయర్ అనేంత గర్వాన్ని ఇచ్చిన పాఠశాల అది. అందుకే మనలో ఎంతోమంది క్రీడాకారులు ఉన్నారు. ఇక సున్నపు గీతలతో కారిడార్‌లా వేసిన రన్నింగ్

ట్రాక్‌లు, ఖో–ఖో, వాలీబాల్, లాంగ్ జంప్, హై జంప్, షాట్‌పుట్, జావెలిన్ ఏ పాఠశాలలో లేని క్రీడా పరికరాలు మన స్కూల్లో ఉండటం ఎంత పెద్ద అదృష్టమో ఇప్పుడు గ్రహిస్తున్నాం. క్రీడా జ్యోతి వెలిగినప్పుడు రన్నింగ్ ట్రాక్ మీద మనమంతా పరిగెత్తుతుండగా ప్రత్యేకంగా వికలాంగ మిత్రులు జ్యోతి చేతబట్టి పరిగెత్తిన దృశ్యం, అది జీవితాంతం మన హృదయంలో నిలిచిపోయింది. విక్టరీ స్టాండ్‌పై విజేతలుగా మెడల్స్ అది స్నేహితుల నవ్వు మన గెలుపు కూడా..., మన పాఠశాల వేదిక మన మొదటి జీవన పాఠంగా ఉంది. మాస్టర్లే మోడల్‌గా నిలిచి అప్పట్లో వారు చేసిన చిన్న నాటికలు వాటి వెంట మనం వేసిన నాటకాలు, పాటలు, స్కిట్స్, విచిత్రవేషాలు మొదటి కరతాళధ్వని, మొదటి ప్రశంస గుర్తున్నాయా...? ఇవే మనలో నేటి మనిషిని మలచిన గుర్తులు. మన డాన్‌బోస్కో మనకు ఇవ్వని అనుభవం లేదు.

క్రమశిక్షణ, ప్రేమ, విలువలు, స్నేహం, మానవత్వం, జాలి, దయాగుణంతో ఈరోజు మనం ఎలా కలిగి ఉన్నామో, దానికి మూలం ఒక్కటే కదా... అదే మన డాన్‌బోస్కో, పాఠశాల అన్నది కేవలం చదువు నేర్పిన స్థలం మాత్రమే కాదు. మనలను ఉన్నతమైన మనుషులుగా తయారు చేసిన దేవాలయం డాన్‌బోస్కో. మన బాల్య మిత్రులు, మన ఉపాధ్యాయులు మన ఆటలు మన పాఠశాల నేల ఇవన్నీ మనలో నేటికీ శ్వాస తీసుకుంటున్నాయి. అందుకే మరోసారి మన డాన్‌బోస్కో దేవాలయంలోకి అడుగు పెట్టుదాం. మరో సారి మన బాల్యాన్ని మనం చూద్దాం. గోల్డెన్ జూబ్లీ అనేది కేవలం వేడుక మాత్రమే కాదు. మన గోల్డెన్ పీరియడ్‌ను తిరిగి చూడటానికి వచ్చిన బంగారు అవకాశం.

# ౬. పేటేటి లాజర్‌బాబు - సైన్స్ మాస్టర్ అందరివాడు

**డా**న్‌బోస్కో పాఠశాల అంటే ఒకప్పుడు అక్కడి పిల్లలు అత్యంత ఆసక్తిగా ఆయన క్లాస్ కోసం ఎదురుచూసే ఒక ప్రత్యేక పరిస్థితి ఉండేది. అదే పేటేటి లాజర్‌బాబు సార్ సైన్స్ పీరియడ్. పాఠశాల చరిత్రంతా ఆయన పేరు ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. స్థాపన కాలం నుండి రిటైర్మెంట్ దాకా ఎన్నో తరాలు మారినా, సైన్స్ మాస్టారు అనే పేరు మాత్రం విద్యార్థుల హృదయాల్లో ఒకేలా మెదులుతూనే ఉంది.

సైన్స్ మాస్టర్ మంగళగిరి నుండి సైకిల్ పై వచ్చే సరదా వ్యక్తి. ప్రతిరోజూ మంగళగిరి పట్టణం నుంచి తన సైకిల్‌పై ఎర్రబాలెం డాన్‌బోస్కోకు ప్రయాణం చేసిన వ్యక్తి. అది కేవలం ప్రయాణం కాదు, ఆయన ప్రేమకు, పిల్లలపై చూపిన ఆప్యాయతకు ప్రతీక. ఆయన స్కూల్‌కు వచ్చే మార్గంలో నడుచుకుంటూ వస్తున్న చిన్నపిల్లలైన విద్యార్థులు కనిపిస్తే, "ఎక్కురా ఇద్దరం సర్దుకుని వెళ్దాం," అని సైకిల్‌పై ఎంతమందికి అవకాశం ఉంటే అంతమందిని తన సైకిల్ పై ఎక్కించుకుని తీసుకెళ్లేవారు. పాఠశాల ముగిసినా అదే ప్రక్రియ విద్యార్థులుపై అదే ప్రేమ.

అలా పిల్లలను రోడ్డుపై కనిపిస్తే వారిని కూడా ఎక్కించుకుని వారిఇళ్లకు సమీపంలో దించడం ఆయనకు ఆనవాయితీ. సైకిల్ పైనే సరదా మాటలు, చిన్నచిన్న జోకులు–పిల్లలు నవ్వేలా, ఉత్సాహపడేలా, పాఠశాల బయట కూడా "ఆయనే మన మాస్టర్" అని అభిమానం కట్టలు తెంచుకున్నంతగా విద్యార్థులు ప్రవర్తించేవారు.

అందుకే పిల్లలు ఆయన్ని గౌరవించడమే కాకుండా, ఒక మంచి స్నేహితుడిగా కూడా ప్రేమించారు. పాఠం అనేది భయంలా కాదు చాలా సరదాగా నేర్పే కళగా ఉండేది మాస్టర్ గారి విద్యాబోధన. లాజర్‌బాబు

గారి పాఠం అంటే క్లాస్‌లో ఉన్న విద్యార్థులకు ఒక పండుగ. బోరింగ్‌గా, నియమపూర్వకంగా ఉండే పాఠం ఆయన దగ్గర సరదాగా కథ చెప్పినట్లు చాలా ఆశక్తిగా ఉండేది.

ఎంత అర్థం కాని వారికైనా ఏ పాఠమైనా, ఆయన క్లాస్‌లోకి వచ్చి చెప్పగానే అంతా క్రిస్టల్ క్లియర్ అయిపోయేదన్న మాట. ప్రతి పీరియడ్ ముగియ డానికి కొద్దిసేపటి ముందే పాఠం ముగించి,ఎవరికి అర్థం కాలేదో చెప్పండి అని విద్యార్థుల్ని ఒక్కొక్కరిని పేరుపెట్టి పిలిచి మాట్లాడే వారు. ఒకరు "సార్, కొంచెం అర్థం కాలేదు" అన్నా, వెంటనే మళ్లీ ఆ పాఠాన్ని సులభంగా, సరదాగా భోదించేవారు. క్లాస్ అంతా నవ్వులు, సరదా, జోకులు, మధ్యమధ్యలో విద్యార్థులకు పెట్టే గమ్మత్తైన నిక్ నేమ్స్ ఇలా సైన్స్ పీరియడ్ అంటే పుస్తకాలు మాత్రమే కాదు, పిల్లల నవ్వులే అనేలా క్లాస్ ఎప్పుడూ సరదాగా ఉండేది. అలాగే క్లాస్‌లో ఎక్కడినుండో నవ్వులు వినిపిస్తే, "అది సైన్స్ మాస్టార్ క్లాస్ అయివుంటుంది," అని పాఠశాల అంతా అనుకునేంతగా ఆయన పేరు వెలిగింది.

సెలవులు,ఆదివారాలు వచ్చిన వేళల్లో ఆయన పిల్లలతో ఉన్న అనుబంధం తగ్గేది కాదు. సైకిల్‌పై గ్రామాలకు చిన్న షికార్లు విద్యార్థులు కనిపిస్తే ఆగి పలకరింపు, సరదా మాటలు మాస్టర్‌ని గ్రామవీధుల్లో చూసే ప్రతి విద్యార్థికి ఆయన ఒక ప్రత్యేకవ్యక్తి. సినిమా హాల్లో కూడా గురువుగారు కనిపించేవారు, కానీ ప్రేమతో ఉండేవారు. యదాభావిగా మంగళగిరిలో సినిమాకు వచ్చినప్పుడు ఆయన్ని చూసి కొంతమంది పిల్లలు దాక్కునేవారు.గురువు చూస్తే ఏదైనా అంటారేమో అనేది భయం వారిలో ఉండేది. కానీ మాస్టారు మాత్రం ఎప్పటిలానే వారిని చూసినా చూడనట్లు లోపలికి వెళ్లిపోతారు.

"పిల్లల ఆనందం నా వల్ల తగ్గకూడదు,"అనేది ఆయన తత్వం. మరుసటిరోజు మాత్రం హాల్లో ఏ మూలన ఎవరున్నారు అనే వివరాలతో సహా సరదాచేసేవారు. "ఏరా సినిమా బాగుందా?" అని చిరునవ్వుతో అడగడం ఆయన ప్రత్యేకత. సైన్స్ మాస్టారు అనే పేరు ఒక భావం. సరదా అంటే సైన్స్ మాస్టారు, స్నేహం అంటే సైన్స్ మాస్టారు, సులభంగా పాఠాలు చెప్పే కళ అంటే సైన్స్ మాస్టారు. ఆయన ఒక గురువు మాత్రమే కాదు, పిల్లల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన అందరిని నవ్వించే అత్యంత ప్రేమగురువు.



డాన్‌బోస్కో పాఠశాల ఆనాటి ఆధ్యాపక బృందం

# 7. మన డాన్‌బోస్కోతో 91-92 బ్యాచ్ పెనవేసుకున్న బంధం.

**డా**న్‌బోస్కో ప్రేమ్ నివాస్ మన జీవితాలకు పునాది వేసిన ఆ చిన్న పాఠశాల,నేడు 50వసంతాలు పూర్తిచేసుకుంటుంది. ఒక్క క్షణం కళ్లు మూసుకుంటే, ఆ స్కూల్ గేటు దగ్గరే మన బాల్యం ఇంకా కూర్చుని మన కోసం ఎదురుచూస్తున్నట్టే ఉంటుంది. అవును, 1981-82 విద్యాసంవత్సరం.

మన తల్లిదండ్రులు పెద్ద కలలతో ఇంటి బాదరబందీ, ఆర్థిక ఇబ్బందులన్నిటి మధ్య మమ్మల్ని డాన్‌బోస్కోలో చేర్పించడానికి సంవత్సరాల తరబడి ఎదురు చూశారు. ఆ రోజున చదువుచెప్పే పాఠశాలలు అరుదుగా దగ్గరలో ఉండేవి. ఇక చదువుకోవాలంటే రెండు మూడు గ్రామాలు నడిచి వెళ్లాల్సిన రోజులు అవి. అలాంటి పరిస్థితుల్లో "మన పిల్లలు తప్పకుండా డాన్‌బోస్కోలోనే చదవాలి" అనేది మా తల్లిదండ్రుల అంతిమ కోరిక. అయితే దీనికి ఓ కారణం ఉండేది. ఆ స్కూల్ ఒక విద్యాలయం కంటే ఎక్కువ ఒక ఆలయం లాంటిది. చదువు బాగా చెబుతున్నారనే టాక్ అన్ని ప్రాంతాలలో గొప్పపేరై నిలిచింది.

డాన్‌బోస్కో పాఠశాల ఆవరణలో చిన్న పిల్లలు ఆదుకునేందుకు చిన్న పార్క్ ఉండేది. విశాలమైన క్రీడాప్రాంగణం ఉండేది. టీచర్ల ప్రేమ, క్రమశిక్షణ, శ్రద్ధ ఇవన్నీ కలగలసి, పిల్లలు పాఠశాలకు వెళ్లడం అంటే పండగ వాతావరణం ఉండేది. దీని కారణంగా డాన్‌బోస్కోలో చదివిన పిల్లలు ఎప్పుడూ "స్కూల్‌కు వెళ్లాలా?" అని కాదు "ఎప్పుడు వెళ్దాం?" అని అడిగేవారు. మనమూ అలాంటి వారమే. మా పాఠశాల, మాపై గర్వపడే హక్కు ఎప్పుడూ దానికి ఉండేలా స్కూల్ పై గౌరవం పెంచుకున్న విద్యార్థులు అందరిలా మా బ్యాచ్ లోనూ ఉన్నారు.

మనకు పాఠాలు బోధించిన గురువులు నేడు మనలో లేరు. అయితే కాలమే వారిలో కొందరిని 'కరోనా' రూపంలో కాటువేసి తీసుకెళ్లింది. కానీ నేడు కూడా మన ఎదుగుదల చూడగానే, మన గురించి వినగానే "వీళ్ళు నా విద్యార్థులు" అని గర్వపడే మాస్టర్లూ, ఫాదర్లూ ఇంకా ఉన్నారు చాలా సంతోషం. మేము అప్పట్లో సమయం కుదిరినవేళల్లో వారిని తప్పనిసరిగా కలుసుకోవడం అది మా బాధ్యతగా వ్యవహరించాం. ఎలాగైనా వారి ఋణం తీర్చుకోవచ్చని కానీ వారిని తలచుకుంటే ఉపాధ్యాయుల రుణం ఎప్పటికి తీర్చుకోలేనిది అని ఇప్పుడు అర్థమవుతుంది.

మన అడుగుల ధ్వని కోసం, మన నవ్వుల కోసం, మన కలయిక కోసం అలాగే, మనం వేగంగా విసిరిన టుంగుటూయలలు, మనం ఆడిన కోతి కొమ్మచ్చి, గోడదూకి బయటకు పోయిన ఆ సాహసాలు ఇవన్నీ ఇంకా ఆ స్కూల్ ప్రాంగణంలోనే తిరుగుతున్నాయని చెప్పుకున్నాం సరదా ముచ్చట్లుగా, మాకంటే ముందు బ్యాచులు మా తరువాత బ్యాచులు అన్నింటికి మధ్యలో ఉన్న అనుసంధాన బ్యాచ్ మాదే, అంతెందుకు గడిచిపోయిన కాలానికి, నడుస్తున్న కాలానికి 1990వ దశకం ప్రత్యేకమైనది అని ఎలా చెబుతారో.... అలా మేము 1991-92 బ్యాచుగా పాఠశాల మాకు చాలా గుర్తులు మిగిల్చింది.

మా బ్యాచ్‌తోనే స్కూల్ డాన్‌బోస్కో హై స్కూల్ గా మారింది. మా బ్యాచ్ చదివిన కొందరు అమ్మాయిలకు 6వ తరగతి తరువాత ఇక్కడ చదువుకునే అవకాశం లేకపోయినా ఇక్కడే చదువులకు పునాది అని గొప్పగా చెప్పుకుంటున్నారు. అలాగే ఇక్కడే చదివిన మన మిత్రులు ప్రైవేట్ టీచర్లుగా మన పాఠశాలకు సేవలు అందించిన ఇద్దరు మిత్రులు కూడా మా బ్యాచ్‌లోనే ఉన్నారు. పాఠశాల భవనాల నిర్మాణ మేస్త్రీ కూడా మా బ్యాచ్ విద్యార్థి నాన్నగారేనని తెలుసా...?

మన తరగతి గదులు ఇంకా మన పేర్లతో మనల్ని పిలుస్తున్నాయి. మనం కూర్చున్న బెంచీలు ఎప్పుడు మళ్లీ మనం వచ్చి కూర్చుంటామా అని ఎదురుచూస్తున్నాయి. మనమే పెద్దవాళ్ళమయ్యాం. మన పాఠశాలకు కూడా ఇప్పుడు 50 ఏళ్లు. మనకు కూడా అటు-ఇటుగా 50ఏళ్ళు కదా. మన బాల్యం నడిచి ఎటేటో... వెళ్లిపోయింది. మనమూ యువకులం అయ్యాం ఇప్పుడు కుటుంబాలతో బిజీ జీవితాల్లో ఉన్నాం.

కొద్ది రోజులలోపే వృద్ధుల మవుతాం. కానీ ఆ స్కూల్? అది మాత్రం మన బాల్యం ఉన్నట్లే ఉంది ఇంకా.... ఎందుకంటే అక్కడ ఉంది మనమే కదా అందుకే, అది మన అదృష్టం, మన తరానికి వచ్చిన వరం. చివరిగా ఓ మాట పాఠశాల పుట్టింది మన కోసం-మనం పుట్టాం ఆ పాఠశాల కోసం. ఈ రెండూ ఒకేసారి జరగడం అద్భుతం కాదా? మన జ్ఞాపకాలు, మన స్నేహాలు, మన బంధాలు మరోసారి మనల్ని మనం చూసుకునే సమయం వచ్చింది.



డాన్‌బోస్కో పాఠశాల 1991-92, 10వ తరగతి విదార్థులు

# 8. డాన్‌బోస్కో విద్యార్థులకు జ్ఞాన-విజ్ఞాన బాండాగారం

**డా**న్‌బోస్కో పాఠశాల విద్యార్థులుగా మంచి, చదువు, జ్ఞానం, విజ్ఞానం, క్రమశిక్షణ, బాధ్యత, ప్రేమ, జాలి, దయాగుణం, నీతి–నిజాయితీ, సమానత్వం– మానవత్వం ఇలా ఒక మంచి మనిషికి ఉండాల్సిన లక్షణాలను మనం చదువుకున్న పాఠశాలలో మన ఉపాధ్యాయులు మనకు నేర్పించారు. ఇటువంటి మంచి లక్షణాలు కలిగిన విద్యార్థులు ప్రత్యేక వ్యక్తులుగా సమాజాన్ని సంస్కరించేవారుగా ఉంటారని థామస్ ఫాధర్ గారి నమ్మకం. అందుకే తాను స్థాపించిన ఆనాటి మంగళగిరి డాన్‌బోస్కో ఆయన ఆలోచనలకు ప్రతిరూపంగా నిలిచింది. ఫాధర్ ఆలోచన అంతా తాను చేయగలిగినంత మంచి, ఎదుటివారికి సాయం చేయాలనే నిలువెత్తు రూపంలో కనిపించేవారు. పాఠశాల వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉండేది.

## జ్ఞానం-విజ్ఞానం

ప్రతి విద్యార్థి జ్ఞానవంతులుగా ఎదగాలి అంటే చదువు–పరిసరాల పరిజ్ఞానం చాలా అవసరం. జ్ఞానాన్ని పంచే విద్య, మంచి విద్యాబోధన చేయగలిగిన నిష్ణాతులైన ఉపాధ్యాయులను థామస్ ఫాధర్ మనకోసం ఏర్పాటు చేశారు. అంతటి ప్రత్యేకమైన టీచర్ల విద్యా బోధన, విద్యార్థులు సాధించే మెరుగైన ఫలితాల కారణంగా మన డాన్‌బోస్కో పాఠశాలకు మంచి గుర్తింపు వచ్చింది.

మరో విషయం జ్ఞాన సముపార్జన విషయం తెలుసుకున్నాం కదా...!మరి విజ్ఞానం మనకు ఎవరు నేర్పారు గుర్తుందా. అవును ఈ విజ్ఞానం మనకు అందించడంలో మన ఉపాధ్యాయులలో ప్రతి ఒక్కరి పాత్ర ఉంది. పాఠశాలలో చదువుతో పాటు నాటి మనపాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎన్.లూర్థురాజు గారు ఏడాదికి ఒకటి, రెండుసార్లు

విద్యార్థులకు విజ్ఞాన/విహార యాత్రలకు తీసుకెళ్ళేవారు. అలా మనం విజయవాడ గాంధీ హిల్ నుండి కొండపల్లి కోటకు, అమరావతి మ్యూజియం, భౌద్ధస్థూపం, ఉండవల్లి గృహాలు, గన్నవరం విమానాశ్రయం, మచిలీపట్నం బీచ్, విశాఖపట్నం, నాగార్జున సాగర్, సాగర్ లాంచీ ప్రయాణం, నీటిమధ్యలో చరిత్రకు సాక్ష్యాధారాలుగా నిలిచిన శిల్పాలు, ప్రత్యేక ఫలకాలు ఉన్న మ్యూజియం మరియు హైదరాబాద్ చార్‌మీనార్, గోల్కొండ, ట్యాంకుబండ్‌పై ప్రముఖుల విగ్రహాలు, బిర్లా మందిర్, జంతు ప్రదర్శనశాల అలాగే ప్రక్క రాష్ట్రం తమిళనాడులోని ప్రదాన నగరం మద్రాస్ (చెన్నై) అక్కడ మేరీనా బీచ్, ఎం.జీ.ఆర్ సమాధి, షిప్ యార్డ్ ప్రయాణం, ఓడఎక్కిన గుర్తులు, చెన్నైకి దగ్గరలోని మహాబలిపురం, అనంతరం లిఫ్ట్ ఎక్కి లైట్ హౌస్ పైకి వెళ్ళడం వాటిని ఆశ్చర్యంగా, పరిశీలనగా చూస్తూ తెలియనివాటిని గురించి తెలుసుకోవడం గుర్తుకొస్తున్నాయా....! మరి ఇదేగా మనం నేర్చుకున్న విజ్ఞానం.

**వ్యవసాయ క్షేత్రం**

మన పాఠశాల ఓ వ్యవసాయ క్షేత్రంలా కనిపించేది. స్కూల్ వెనుక వికలాంగులకు బూట్లు, చేతికర్రలు తయారుచేసే భవనం ముందు కాళీ స్థలంలో చాలా పంటలు పండించేవారు. ముఖ్యంగా బొప్పాయి, కంది, వేరుశనగ, కంద, కర్రపెండలం ఇవన్నీ పండించేవారు. కర్ర పెండలం వంటి ప్రత్యేక పంటలను చూసి ఆశ్చర్యానికి గురై దానిని పరిశీలించిన గుర్తులు ఇప్పటికీ అలానే ఉన్నాయి కదూ...!

అలాగే వ్యవసాయంలో భాగమైన మరొకటి జెర్సీ ఆవుల పరిశ్రమ పాల ఉత్పత్తి, సీమ పందుల పెంపకం, కోళ్ళ పరిశ్రమ నుండి కోడిగుడ్లు ఉత్పత్తితో హాస్టల్ పిల్లలకు పోషకాహారం అందించేవారు. ఇలా బయట కూలీలతో వ్యవసాయం చేయించి ఆహార సంపదను పెంచుకున్నారు. అలాగే మరో విషయం బాతులు, కోతులు, జాతి కుక్కలు ఉండేవి. ఇంకా చిలుకలు, ఉడతలు, కుందేళ్లు, లవ్ బర్డ్స్ ఉండేవి కదా...! వీటిని చూసి

ఆనందం రెండింతలుగా సంతోషపడేవాళ్ళం మనం. ఆ వయసులో వాటిని చూడటం ఇళ్ళకు వెళ్ళాక ఇంటివద్ద పిల్లలకు వాటి గురించి చెప్పడం ద్వారా మనకు తెలియకుండానే మనం జ్ఞానంతో పాటు విజ్ఞానం పొందడం అలవాటు చేసుకున్నాం.

**క్రీడలు-క్రీడా ప్రాంగణం**

క్రీడలు పిల్లల మానసిక ఉల్లాసానికి బాగా ఉపయోగం. మన పాఠశాలలో మంచి విద్యతో పాటు, విద్యార్థులు క్రీడలకు ప్రత్యేక స్థానం ఉండేది. ప్రతి తరగతి టైం టేబుల్లో మన ఆటలకోసం వారంలో రెండు, మూడు పీరియడ్స్ తప్పక ఉండేవి. సాయంత్రం వేళల్లో ఏదో ఒక తరగతి పిల్లలు ఆటలు ఆడేవారు. మొత్తానికి క్రీడా మైదానం ప్రతి సాయంత్రం కళకళలాడుతూ అరుపులు–కేకలు, తాము ఆడే ఆటలో విజయం సాధించాలి అనే కసి, పోరాటం ఆ క్రీడా మైదానంలో ఉన్న ప్రతి ఒక్కరిలో కనిపించేది.

క్రీడలకు అవసరమైన క్రీడా పరికరాలు అవి మనం ఎప్పుడూ చూసి ఉండం. కానీ వాలీబాల్, ఫుట్ బాల్,బేస్ బాల్, హ్యాండ్ బాల్, బాస్కెట్ బాల్ వీటిలో మహా అయితే పాఠశాలలో చేరక ముందు ఒక్క వాలీ బాల్ మాత్రమే తెలిసి ఉండేది. అలాగే బాస్కెట్ బాల్ అంటే తెలియదు మరి స్కూల్‌కి చేరాక బాస్కెట్ బాల్‌తో పాటు ఫుట్ బాల్ వరకు మనం అన్ని ఆటలు ఆడిన వాళ్ళమే కదా..., ఇక ఫుట్ బాల్ విషయానికి వస్తే అందరూ ఫుట్ బాల్ ప్లేయర్స్.ఫుట్ బాల్ గ్రౌండ్ లో గోల్ వేసేందుకు వీరోచితంగా పోరాటం చేసేవాళ్ళం.ఎట్లయిన అదో గోల్డెన్ పీరియడ్ అంతే.... ఆరోజులు తిరిగిరానివి, మరిచి పోలేనివి.

ఇంకా ఆ క్రీడా మైదానంలో కబాడీ, ఖోఖో, లాంగ్ జంప్, హై జంప్, షాట్ ఫుట్, జావెలిన్, డిస్కస్ త్రో విసిరిన గుర్తులు అందరికీ ఉన్నాయి. రన్నింగ్, షార్ట్ రన్నర్స్, లాంగ్ రన్నర్స్ పరుగులు, రిలే రన్నింగ్ అబ్బో.... ఎంతో క్రీడా స్ఫూర్తితో పెరిగిన మనం ఇప్పటికి ఆ శక్తితో

ఫిట్‌గానే ఉన్నాం. ఇక ఆడపిల్లలు ఆడే ఆటలకు వారికి అవసరమైన క్రీడా పరికరాలు ఉండేవి. వారి ఆటలతో వారు కూడా సాయంత్రం సమయాల్లో ఆటల్లో మునిగితేలేవారు. ఆడపిల్లలు ఆటలాడుతుంటే వారిని ప్రోత్సహించి వారిలో మానసిక ధైర్యాన్ని నింపినవాళ్ళం కదా... మనందరం.

**స్కూల్ ఆవరణలో తోట పనులు.**

మన పాఠశాలలో మనం చేయగలిగిన పనులను మన డ్రాయింగ్ మాస్టర్ అరుల్ దాస్ గారు చేయించారు. ఉదయం స్కూల్ కి వెళ్ళగానే మొక్కలకు నీళ్ళు పోయడం, మనం నాటిన మొక్కల మధ్య పిచ్చి మొక్కలను పీకడం వంటి పనులు బాధ్యతగా చేసేవాళ్ళం. పాఠశాల పరిసరాల పరిశుభ్రంగా ఉంచేవాళ్ళం. పాఠశాల వరకు మెరుగైన పర్యావరణ కోసం ఎప్పుడూ జాగ్రత్త వహించిన వాళ్ళం. ఇప్పటికీ మనం ఎక్కడ ఉన్నా భాద్యతగా పచ్చదనం–పరిశుభ్రత, పర్యావరణ బాధ్యతతో ఉన్నవాళ్ళమే కదా.

**స్కూల్ మొత్తం విద్యార్థులను టీమ్స్‌గా విభజన..**

వందలమంది విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచేందుకు ఈ టీమ్స్ బాగా ఉపయోగం ఉండేవి. చదువుకోవడానికి వచ్చిన పిల్లలను క్రమశిక్షణ లోపం లేకుండా ఉండేందుకు కొట్టడం కన్నా, టీమ్ పేరిట పనిష్మెంట్ చేయడం వలన కూడా కొందరి పిల్లల్లో మారిన ప్రవర్తనతో ఎదిగారు. రెడ్, ఎల్లో, బ్లూ, గ్రీన్, బ్రౌన్ టీమ్స్ ఏర్పాటు చేసి విద్యార్థులను వాటిలో టీమ్ సభ్యులుగా చేర్చబడింది. మంచి పనులకు ప్లస్ మార్కులు, కాని పనులకు మైనస్ మార్కులు ఈ విధానం ద్వారా అన్నీ టీమ్స్‌లో ఉన్న విద్యార్థులలో అనుకోని విధంగా మంచి మార్పు కలిగింది.

# 9. ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు గ్రహీత ఎన్. లూర్థురాజు - 2005

**ఉన్నత ప్రమాణాలు పాటించడం ద్వారానే, విద్యార్థుల భవిష్యత్తు పురోగమిస్తుంది.**

**ఒ**క రచయిత, సీనియర్ జర్నలిస్ట్ అనే దానికి ముందుగా నేను కూడా మీ అందరిలా డాన్‌బోస్కో పాఠశాల విద్యార్థిని, నేను చదువుకున్న మన పాఠశాల అంటే నాకు చాలా గౌరవం, అక్కడ టీచర్లు, విద్యార్థులు, మా సీనియర్లు, సూపర్ సీనియర్లు, బ్రదర్స్, ఫాదర్స్ మరియు స్నేహితులు ప్రతి ఒక్కరిపై నాకు గౌరవం ఉంది. ఇక మన పాఠశాల వ్యవస్థాపకులు థామస్ ఫాధర్, మొట్ట మొదటిగా మన పాఠశాల ఏకోపాధ్యాయునిగా అన్ని విషయాలలో థామస్ ఫాధర్ తో కలిసి, మన డాన్‌బోస్కో అభివృద్ధిలో లూర్థురాజు మాస్టర్ పాత్ర చాలావుంది. తొలినాళ్ళలో స్కూల్‌కి, విద్యార్థులకు, ఫాధర్ థామస్‌కి ఆయన అందించిన సహకారం అనిర్వచనీయమైనది.

థామస్ ఫాధర్ ఆలోచనలకు అండగా నిలిచి ఈ రోజున డాన్‌బోస్కో తెలుగుమీడియం పాఠశాల స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకుంది అంటే ఆనాటి ఆయన కృషి కూడా మరువలేం. ఈ సందర్భంగా 2006లో లూర్థురాజు మాస్టర్ గారితో నేను చేసిన ఇంటర్వ్యూ మరోసారి మీ కోసం...., ఓ రోజు స్కూల్ ఆవరణలో జరుగుతున్న కార్యక్రమానికి ఆనాటి స్థానిక ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న మురుగుడు హనుమంతరావు గారు ముఖ్య అతిథిగా వచ్చారు. ఆ సందర్భంగా మాస్టర్ గారు నన్ను మంత్రిగారికి పరిచయం చేసి మా విద్యార్థి సార్ జర్నలిస్ట్ అని గొప్పగా చెప్పారు. అనంతరం జర్నలిస్ట్‌గా నీవు మరింతగా ఎదగాలోయ్...., అని నన్ను ఆశీర్వదించారు. గురువుల ఆశీర్వాదాలు విద్యార్థులకు ఎప్పుడూ ఉండాలి.

**డాన్‌బోస్కో పాఠశాల గురించి లూర్థురాజు మాస్టర్ గారు చెప్పిన వివరాలు.**

నేడు ప్రభుత్వ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలు విద్యార్థులకు సరైన విద్యను అందించని సర్కారు పాఠశాలలు చాలా ఉన్నాయి అనడంలో ఎలాంటి సంకోచం లేదు. కానీ ఉత్తమ విద్యాభోదన, ఉత్తమ క్రమశిక్షణ కలిగి విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు అందిస్తూ, ప్రతి ఏటా ఒక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులే "ఉత్తమ ఉపాధ్యాయుల" అవార్డును స్వీకరించుటలోనే ఆ పాఠశాల ఘనకీర్తి ఎంతోఉంది. అలాగే అక్కడ ఉపాధ్యాయుల నిరంతర కృషివల్ల మెరుగైన ఫలితాలు అందుకొనే పేద విద్యార్థుల తల్లిదండ్రుల ఆశాజ్యోతియై,ఇది మా పిల్లల పాఠశాల కాదు మాకూ ఒక దేవాలయంగా అవతరించిన ఒక గొప్ప విద్యాలయం అని గర్వంగా చెప్పుకునే పాఠశాలల్లో డాన్‌బోస్కో ప్రేమ్ నివాస్ ఒకటి.

మానవత్వం మూర్తి భవించిన విశిష్ట వ్యక్తి డాన్‌బోస్కో సంస్థ సభ్యులైన గురుపుంగవులు ఫాదర్ థామస్ చిన్నప్ప వికలాంగులకు, అనాధలకు సంపూర్ణ వ్యక్తిత్వమును చేకూర్చవలెనన్న సదాశయంతో ఆగష్టు 1వ తేదీన 1976వ సంవత్సరం ప్రశాంత వాతావరణంలో మంగళగిరిలో డాన్‌బోస్కో ప్రేమ్ నివాస్ సంస్థను స్థాపించారు. ఈ సంస్థలో ఆశ్రయం పొందిన ఆనాధ వికలాంగులకు మరియు తల్లి దండ్రులను కోల్పోయిన అనాథలకు విద్యను అందించాలి అనే ఆశయంతో, 02-08-1976న డాన్‌బోస్కో ప్రాథమిక పాఠశాల (ఏకోపాధ్యాయ పాఠశాలగా) స్థాపించారు. ఆనాటి ఏకోపాధ్యాయ పాఠశాలలో భోదన భాధ్యతలను స్వీకరించి 2005 నాటికి గుంటూరు జిల్లాస్థాయి "ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా గురుపూజోత్సవం (05 సెప్టెంబర్ 2005)నాడు అవార్డు అందుకొన్నారు శ్రీ. యన్, లూర్థురాజు. అంతకు ముందే పాఠశాల భాధ్యతలను స్వీకరించి నేడు ఈ అవార్డును అందుకున్న ఉపాధ్యాయులు యన్. లూర్థురాజు, ఎం.ఏ. ఎం.ఇ.డి, ఎల్.ఎల్.బి. ఇతని ఆధ్వర్యంలోనే పాఠశాల విద్యలో అభివృద్ధి గాంచింది.

అనాథలకోసమే కాకుండా పాఠశాలల్లో చదువుకోలేని పేద విద్యార్థులకు సైతం విద్యను అందించారు. తోటి ఉపాధ్యాయులతో కలిసి నిరంతరం విద్యాప్రమాణాలను మెరుగుపరిచి అందరికీ విద్య అందాలి. అందుకోసం ఉపాధ్యాయులందరూ కష్టపడి విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను బోధించాలి అంటే ఈ ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు గ్రహీత యస్. లూర్థురాజుతో 'నేడు ప్రభుత్వం తీసుకుంటున్న పాఠశాల విద్యా విధానంలో మార్పులు, చేర్పులు, అభివృద్ధి విషయాల కోసం "జనపక్షం" మాసపత్రిక ప్రతినిధి ఈపూరి రాజారత్నం ఆనాడు చేసిన ప్రత్యేక ఇంటర్వ్యూ విశేషాలు...

**ఆనాటి ఇంటర్వ్యూ విషయాలు ఇవే...**

**(ప్ర) జిల్లాలో ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా, మంచివిద్యను భోధించగల మీకు, మన పాఠశాలకు, గుర్తింపు రావటానికి గల కృషి, దాని వెనుకగల రహస్యం?**

**(జ)** జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు పొంది, అవార్డు పొందుటలో గల రహస్యం మా సంస్థ సమిష్టి కృషి, ఈ విద్యా సంవత్సరంలో నాతో పాటు, మా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని శ్రీమతి పి. ఇన్యాసమ్మ బి.ఎ.బి.ఇడి,కి కూడా ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డు లభించింది. అలాగే 2001- 2002 విద్యాసంవత్సరంలో మా పాఠశాల ఉపాధ్యాయులు శ్రీ.పి.అరుల్ దాస్, 2002-03లో శ్రీ. పి. లాజర్‌బాబ్ (సైన్స్‌స్టర్)లు ఈ అవార్డులను అందుకున్నారు. మా డాన్‌బోస్కో పాఠశాల ఇంతగా గుర్తింపు పొందేందుకు వెనుక రహస్యం ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల నుండి, వీరికోసం నిరంతరం శ్రమించే వారి తల్లిదండ్రులు, పిల్లలు విద్యను క్రమశిక్షణపై ప్రతిక్షణం జాగ్రత్త వహించే ఉపాధ్యాయ బృందం, అలాగే మా అందరికి అనునిత్యం పూర్తి సహకారం అందించిన మా సంస్థ యాజమాన్యం మొత్తంగా కలిపి ఇదంతా మా సమిష్టి విజయం.

**(ప్ర) జిల్లాలో ఉత్తమ ప్రధానోపాధ్యాయులుగా ఎంపికైన విధానం..?**

**(జ)** ఏవ్యక్తి అయిన తన విధిని చిత్తశుద్ధితో, అంకురిత దీక్షతో నిర్వహిస్తారో...ఆ వ్యక్తికి, ఆ సంస్థకు తప్పక గుర్తింపు లభిస్తుంది. విద్యను అందుకోలేని పేద విద్యార్థులకు విద్యను అందిస్తూ వారి ఉన్నతమైన భవిష్యత్ మార్గంలో ఏర్పరచడంలో ఎంతో ఆనందం మాకుంది. అలాంటి విద్యను అందిస్తూ నిరంతరం విద్యను అందించడం ద్వారానే ఈ విద్యాసంవత్సరానికి మా ప్రాథమిక పాఠశాల, ఉపాధ్యాయునికి నాకు ఈ అవార్డు లభించింది.

**(ప్ర) ప్రభుత్వ పాఠశాల విద్యా విధానంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, లోపాలను చెప్పండి?**

**(జ)** ప్రభుత్వ పాఠశాల విద్యా విధానంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు,లోపాలు చాలా ఉన్నాయి. పాఠశాలలో సరైన తరగతి గదులు, బెంచీలు, త్రాగునీటి సమస్యలు ఉన్నాయి. చిత్తశుద్ధి లోపించిన కొందరు టీచర్ల, పాఠ్యపుస్తకాలు అందుబాటు సమయం లోపించడం ఇలా చెపుకుంటూ పోతే చాలా ఉన్నవి ఇంకా "విద్యార్థి-ఉపాధ్యాయ" నిష్పత్తి కొన్ని పాఠశాలల్లో అధికముగా ఉన్నది. నేటి బాలలు రేపటిపౌరులు, భారత దేశ భవిష్యత్తు తరగతి గదిలో తీర్చిదిద్ద బడుతున్నదనే సత్యాలకు అనుకూలంగా,ప్రస్తుతం మన పాఠశాల విద్యా విధానంలో ఊగిసలాట ధోరణి కనబడుతుంది. అయితే ఈ సమస్యలను, లోపాలను అధిగమించాలంటే ప్రభుత్వం దాతలను, స్వచ్ఛంద సంస్థలను పాఠశాల భాగస్వామ్యంలుగా చేయుట అవసరం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు ఈ విధానాలను అధిగమించి కార్పొరేట్ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులతో సమానంగా రాణించగలరు.

**(ప్ర) రానున్న విద్యాసంవత్సరంలో హైస్కూల్ విద్యను ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశపెట్టాలనే ప్రభుత్వ ఆలోచనా విధానంతో మీరు ఏకీభవిస్తున్నారా?**

**(జ)** హైస్కూల్ విద్యను ఇంగ్లీషు మీడియంలో ప్రవేశపెట్టాలన్న ప్రభుత్వ ఆలోచనా విధానం హర్షించదగినది, అభినందనీయం. ఈ ప్రభుత్వపు ఆలోచనా విధానం కార్యరూపం దాల్చాలని మనమందరం ఆశిద్దాం, స్వాగతిద్దాం. నేటి కాలమాన పరిస్థితులలో విద్య కేవలం జ్ఞాన సముపార్జనకే గాక భుక్తికి మార్గంగా స్వీకరిస్తున్నాం అందుకు దీనికి అనుగుణంగా విద్యను అందించవలసిన భాధ్యత ప్రభుత్వానిది. దేశీయ సంస్థలలో పరిమితమైన అవకాశాలు విద్యావంతులందరికీ ఉపాధిని చూపించలేవు. బహుళజాతీయ సంస్థలు దేశంలో కీలకపాత్ర పోషిస్తున్న ఈ సమయంలో పలు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చు కోవాలంటే ఇంగ్లీషుభాష తప్పని సరి, కేవలం ఇంగ్లీష్‌ని ఒక సబ్జెక్టుగా అభ్యసిస్తే లభించే నైపుణ్యం చాలదు. అందుకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే లక్షలాది పేద విద్యార్థులకు ఉద్యోగ ప్రమాణాలకు ఇంగ్లీష్ మీడియం బోధన చాలా అవసరం. అయితే ఈ మార్పును చేపట్టేందుకు, అందుకు అవసరమైన భౌతిక అవసరాలను ప్రభుత్వం కల్పించాలి.

**(ప్ర) ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 'ఆరోగ్య భీమాపథకం" "వృత్తి విద్యాకోర్సులు" స్థాపించాలనే ప్రభుత్వ ఆలోచన మంచిదేనా?**

**(జ)** ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేదవర్గాలకు చెంది, ఆర్థికంగా వెనుకబడి ఉన్న విద్యార్థులే ఎక్కువ. విద్యార్థులు పౌష్టికాహార లోపం వలన అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుచున్నారు. కాబట్టి ప్రభుత్వం మదిలో మెదిలిన ఈ ఆలోచన అమలు జరిగితే విద్యార్థులు

లబ్ధిపొందగలరు. అలాగే పాఠశాల స్థాయిలోనే "వృత్తి విద్యాకోర్సుల" స్థాపన ఆవశ్యకం. మన జాతిపిత మహాత్మగాంధీ పాఠశాలల్లో ప్రాథమిక విద్యను ప్రోత్సహించారు. స్కూల్ స్థాయినుండే విద్యార్థులను వృత్తిలో నిపుణులుగా సుశిక్షితులను చేయాలని ఉంది. బేసిక్ విద్యావిధానంలో సత్ఫలితాలనిస్తుంది. ఉదాహరణకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనహయాంలో కాలేజీస్థాయిలో ఈ వృత్తి విద్యలను ప్రవేశపెట్టి విధ్యార్థులకు కొంతమేరకు సత్ఫలితాలను అందించగలిగారు. కాబట్టి వృత్తి విద్యాకోర్సులు ప్రవేశపెట్టటం కూడా మంచి ఆలోచనే.

**(ప్ర) ఎక్కువ సమయం విధ్యార్థులతో గడిపేది ఉపాధ్యాయులే కాబట్టి, విధ్యాధికారులకన్న నేటివిద్యా విధానంలో ఎటువంటి మార్పులు అవసరమో ఉపాధ్యాయులైన మీరు కొంత వివరణ ఇవ్వండి?**

**(జ)** విద్య "వ్యక్తిగత వికాసంతో పాటు జీవనోపాధిని కల్పించేది అయ్యి ఉండాలి.అటువంటి విద్య ఇప్పుడు చాలా అవసరం. నేటి విద్యారంగంలో సమూల మార్పులు అవసరం. విద్యావ్యవస్థను స్వతంత్రవ్యవస్థగా తీర్చి దిద్దినట్లయితే కాలానుగుణంగా సమాజానికి అవసరమైన విద్యను అందించగలదు. "మంచి విద్యను సమాజానికి అందించాలన్న ఆశయం ప్రభుత్వానికి ఉన్నా, నేటి రాజకీయాలు విద్యారంగాన్ని కొంతమేరకు దెబ్బ తీస్తున్నాయి". అయితే న్యాయవ్యవస్థకు గల స్వతంత్రప్రతిపత్తి ద్వారానే రాజ్యాంగ ఉల్లంఘన జరిగినా, అనేక సందర్భాలలో న్యాయస్థానాలు రాజ్యాంగ పరిరక్షణ చేయగలిగినవి. కాబట్టి విద్యార్థి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే విద్యావ్యవస్థకు స్వతంత్ర పత్తిపత్తి ఉంటే గుణాత్మకమైన మంచి విద్యను సమాజానికి అందించగలదు.


**(ప్ర) ప్రభుత్వ పాఠశాల విద్యావిధానానికి, ప్రైవేటు స్కూళ్ళ విద్యకు మధ్య సగటు విధ్యార్థి భవిష్యత్తుపై మీ అభిప్రాయం.**

**(జ)** విద్యా, విధానం రెండు రకాల పాఠశాలల్లో ఇంచుమించు ఒకటే? అమలుపరిచే విధానంలోనే తేడా, ప్రభుత్వ పాఠశాలల్లో

యాజమాన్యం బాధ్యతారాహిత్యం బాగా కని పిస్తుంది. ప్రైవేటు విద్యా విధానం రిజల్ట్ ఓరియంటెడ్ కొనసాగుచున్నది. కేవలం ఏదో ఒక విషయంలోనే ప్రావీణ్యతను పరిశీలించే అవకాశాన్ని కల్పించే విధానం కొనసాగినంత కాలం ప్రైవేటు విద్యా విధానం సగటు విద్యార్థి భవిష్యత్తుపై ప్రభావం చూపగలదు.

**(ప్ర) ఉత్తమ ప్రధానోపధ్యాయుని అవార్డు గ్రహీతగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, తోటి ఉపాధ్యాయులకు మీరిచ్చే సందేశం?**

**(జ)** ఉపాధ్యాయులైన మనం మన బిడ్డల భవిష్యత్ కోసం ఎంత అతృతగా కృషిచేస్తామో..., ప్రభుత్వ పాఠశాలలను నమ్ముకొని మన వద్దకు వచ్చిన బాల, బాలికలను మన బిడ్డలుగా భావించి వారిని తీర్చి దిద్దుటకొరకు నిర్మలమైన మనస్సుతో కృషి చేసి మంచి విద్యను అందించి ప్రభుత్వ పాఠశాలల భవిష్యత్ కాపాడుకోవటం మనందరి ఉపాధ్యాయుల వృత్తి ధర్మం..


...ప్రమాణాలు పాటించడం ద్వారానే

## విద్యార్థుల భవిష్యత్తు పురోగమిస్తుంది

ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు గ్రహీత ఎన్. లూర్దురాజు

నేడు ప్రభుత్వ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలు విద్యార్థులకు సరియైన విద్యను అందించని సర్కారు పాఠశాలలు చాలా ఉన్నాయి అనడంలో ఏమాత్రం సంకోచంలేదు. కానీ ఉత్తమ విద్యాబోధన, ఉత్తమ క్రమశిక్షణ కలిగి విద్యార్థులకు ఉత్తమమైన ఫలితాలను అందిస్తూ, ప్రతి ఏటా ఒక పాఠశాలకు ...ందిన ఉపాధ్యాయులే "ఉత్తమ ...యుల" అవార్డును స్వీకరించుటలోనే

ఇతని అధ్వర్యంలోనే పాఠశాల విద్యలో ...తో అభివృద్ధి గాంచినది. అనాధలకోసమే కాకుండా కార్పొరేట్ పాఠశాలల్లో చదువుకొలేని పేద విద్యార్థులకు సైతం విద్యను అందించే పాఠశాలగా తీర్చిదిద్దారు. తోటి ఉపాధ్యాయులతో కలిసినిరంతరం విద్యాప్రమాణాలను మెరుగుపరిచి అందరికీ విద్యను అందివాలి. అందుకోసం ఉపాధ్యాయులందరూ కష్టపడి విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను బోధించాలి అనే ఈ ఉత్తమ ...

జిల్లాలో ఉత్తమ ప్రధాన ఉపాధ్యాయులుగా ఎంపికయిన విధానం?

ఏవ్యక్తి అయిన తన విధిని చిత్తశుద్ధితో, అంకురిత దీక్షతో నిర్వహిస్తుంటే ఆ వ్యక్తికి, ... సంస్థకు తప్పక గుర్తింపు లభిస్తుంది. వి... అందుకోలేని పేద విద్యార్థులకు విద... స్తూ, వారి ఉన్నతమైన భవిష్యత్‌కు

కీ॥శే॥ యన్. లూర్థురాజు గారితో పుస్తక రచయిత ఈపూరి రాజారత్నం గతంలో (2006) ఇంటర్వ్యూ చేసిన పేపర్ కటింగ్

# 10. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపిన గురువులు

## (డాన్‌బోస్కో పూర్వవిద్యార్థుల సంఘం విధులు)

**ము**గింపు అంశంగా మరికొన్ని విషయాలను ఇక్కడ తెలుసుకుందాం. 1991–1992 బ్యాచ్ విద్యార్థులమైన మేము 7వ తరగతిలో థామస్ ఫాథర్ గారు మాకు ఇంగ్లీషు సబ్జెక్టు బోధించారు.అంతకు ముందు 3వ తరగతి నుండి ఇంగ్లీషు బోధన ఉండేది. అదీ తెలుగు నుండి ఇంగ్లీషు కాదు, ఇంగ్లీషు టూ ఇంగ్లీషు మాత్రమే. ఇక ఈ ప్రాథమిక ఇంగ్లీషు డాన్‌బోస్కో సంస్థకు చెందిన బ్రదర్స్ చెప్పేవారు. ఇంగ్లీషు గ్రామర్ అర్థం చేసుకోగలిగిన విద్యార్థులకు ఇంగ్లీషు భాషపై బాగా పట్టు సాధించారు. అనంతరం రాజన్న ఫాథర్ కూడా స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా పనిచేశారు.

**ఫా. కె.యస్. జోసఫ్** **(మాజీ ప్రధానోపాధ్యాయులు)**

మా బ్యాచ్ (1991–92) నుండి ఫాథర్ కె.యస్, జోసెఫ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులుగా ఉన్నారు. కె.యస్, ఫాథర్ ఇంగ్లీషు బోధన, ఇంగ్లీషు గ్రామర్‌తో చాలామంది విద్యార్థులు ఆంగ్ల భాషలో ప్రావీణ్యం సాధించారు. ఇక విద్యార్థులు చదువు విషయంలో కె.యస్, ఫాథర్ చాలా ప్రత్యేకశ్రద్ధ వహించేవారు. మా బ్యాచ్ 10వ తరగతిలో ఉన్నప్పుడు ఉదయం పాఠశాల తరగతులు జరిగేవి. సాయంత్రంపూట స్కూల్ వదిలాక ఇంటికివెళ్ళి స్నానంచేసి సాయంత్రం 6 గంటలకు మరలా పాఠశాలకు వెళ్ళాలి. ఫాథర్‌కి కనిపించి స్టడీ హావర్స్‌లో చదువుకోవడానికి రాత్రివరకు అక్కడే ఉండాలి. 6గంటల నుండి రాత్రి 10 గంటలు వరకు చదువుకోవడం జరిగింది. రాత్రికి అక్కడే నిద్రించేవాళ్ళం. ఇక తెల్లవారుజామున 4గంటలకు ఫాథర్ వచ్చి నిద్రలేపి మరలా ఉదయం స్టడీ హావర్ చేయించేవారు. మా కన్నా కూడా కె.యస్, ఫాథర్ మా చదువుపై ఎక్కువ దృష్టి పెట్టేసారు. రాత్రి పడుకున్నారా లేదా..., తెల్లవారుజామున ప్రత్యేకంగా వచ్చి ఎదురుగా కుర్చీ వేసుకుని

చదివించేవారు. ఇంతటి బాధ్యత కలిగి ఉన్నవారిలో కె.యస్, ఫాథర్ పాత్ర చాలాఉంది.

**చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు.**

ఇక సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 10గంటల వరకు కొనసాగే స్టడీ హవర్స్‌లో మరో విధానంలో విద్య బోధన ఉండేది. మా ఉపాధ్యాయుల కష్టం, మా చదువుల కోసం వారు త్యాగం చేసిన ప్రత్యేక ఘడియలు మేమైతే మరువలేం. ఎందుకంటే కొన్ని సబ్జెక్టులలో కొందరు బలహీనమైన చదువుతో ఉండేవారు. అయితే ఉదయం అంతా పాఠశాలలో చదువు చెప్పిన ఉపాధ్యాయులు కొందరు రాత్రివేళ కూడా చదువు చెప్పేవారు. విద్యార్థులు ఏ సబ్జెక్టులో వెనుకబడ్డారు ఆ సబ్జెక్టు టీచర్ 6 గంటల నుండి రాత్రి ఎనిమిది, తొమ్మిది గంటల వరకు ఆయా సబ్జెక్టు పాఠాలను ప్రత్యేకంగా భోధించేవారు.

**జయరాజ్ మాస్టర్**

ప్రత్యేక స్టడీ అవర్స్ భారం జయరాజ్ మాస్టర్ గారిపై ఎక్కువగా ఉండేది. అయినా సరే మాస్టర్ గారు చాలా బాధ్యత వహించి విద్యార్థుల చదువుకు ప్రాధాన్యత ఇచ్చేవారు. మాస్టర్ గారు లెక్కలు, ఫిజిక్స్ సబ్జెక్టులు చెప్పేవారు. మాస్టర్ గారి కష్టం మాటల్లో చెప్పుకోలేం. సార్ కష్టాన్ని మాలాంటి పాత విద్యార్థులు మాత్రమే కాదు ఆయన మొదటి నుండి తెలిసినవారు చెబుతారు. మాస్టర్ గారు మన స్కూల్ టీచర్ అయితే, వారి సతీమణి మంగళగిరి నిర్మలా స్కూల్ టీచర్‌గా ఉండేవారు. ప్రతిరోజు జయరాజ్ మాస్టర్ మేడమ్ గారిని సైకిల్ పై తీసుకెళ్ళి దించేవారు. అలాగే సాయంత్రం వెళ్ళి స్కూల్ నుండి ఇంటివద్ద దించేవారు. కారణం ఆ రోజుల్లో ఎక్కడికి వెళ్ళాలన్నా రవాణా సౌకర్యం పెద్ద సమస్యగా ఉండేది. అందుకే జయరాజ్ మాస్టర్ గారు కాలంతో పోటీపడ్డారు. అడ్డంకులను అధిగమించారు.తక్కువ జీతంతో పనిచేసినా డాన్‌బోస్కో

పాఠశాలపై అపారమైన నమ్మకం ఉంచి అక్కడే ప్రధానోపాధ్యాయులుగా పనిచేశారు.

నాకు తెలిసి జయరాజ్ మాస్టర్ గారు ప్రతి విషయం తెలుసుకోవాలని విధానంలో ఉండేవారు. పైకి కనిపించని కమ్యూనిస్టు భావజాలం ఉన్న మనిషిలా కూడా కనిపించేవారు. మాస్టర్ గారు 1983 క్రికెట్ వరల్డ్ కప్ అందుకున్న భారత క్రికెట్ జట్టు కెప్టెన్ హీరో కపిల్ దేవ్ అభిమానిలా కనిపించేవారు. మేము ఆయన్ని పరిశీలనగా చూసేవాళ్ళం మాస్టర్ గారు కూడా ఆ రోజుల్లో మాకు కపిల్ దేవ్ లాగానే కనిపించేవారు. మాస్టర్‌ని చూస్తూ పెరిగిన వాళ్ళం మేము వారికి ఎప్పుడూ విద్యార్థులమే.... ఎందుకంటే మాస్టర్ గారు తమ వద్ద చదువుకున్నవారే కదా అని ఎవరిని ఏ అవకాశం తీసుకోకుండా అందరిని గౌరవంగా మీరు....అని మాట్లాడేవారు. ఆయన మాస్టర్‌గా మొదటి నుండి మౌనంగా ఎదిగారు. ఉపాధ్యాయుని స్థాయి నుండి డాన్‌బోస్కో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులుగా కూడా పనిచేశారు.

**అరుల్ దాస్ మాస్టర్**

అరుల్ దాస్ మాస్టర్ డాన్‌బోస్కో పాఠశాలలో అరుల్ దాస్ మాస్టర్ అంటే ఆయనది ఓ ప్రత్యేక శైలి. మొదట పాఠశాల డ్రాయింగ్ టీచర్‌గా చెప్పుకోవాలి. ఇక విద్యార్థులకు డ్రాయింగ్ శిక్షణలో బాగా మెలకువలు నేర్పించారు. ప్రతీ సబ్జెక్టు టీచర్ ఎంత ప్రత్యేక నైపుణ్యశైలితో పాఠాలు భోధించేవారో.... డ్రాయింగ్ మాస్టర్ అరుల్ దాస్ అంత ప్రత్యేకం. స్కూల్ పర్యావరణ బాధ్యతలు బాగా నిర్వహించేవారు. విద్యార్థులకు శుభ్రత– పరిశుభ్రత, తోటపని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లు చూడటం చాలా మంచి మంచి డెకరేషన్ చేయించేవారు.

ఓసారి పాఠశాలలో జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాలలో అరుల్ దాస్ మాస్టర్ శిక్షణలో మా బ్యాచ్, మా సీనియర్ బ్యాచ్

విద్యార్థులతో ఒక మంచి స్కిట్ వేయించారు. దానిపేరు ఓర్పు, సహనం. ఆరుగురు మిత్రులు కలసి ఓ రెస్టారెంట్ వెళ్ళారు. అక్కడ అందరూ కలసి తమకు ఇష్టమైన ఆహారం సప్లయర్ ద్వారా ఆర్డర్ వేసి తెప్పిస్తారు. అందులో మా మిత్రుడు కూడా ప్రధానపాత్రలో నటించాడు. ఓర్పు, సహనం క్యారెక్టర్‌లో స్కూల్ విద్యార్థులు అంతా ఆ స్కిట్ ప్రదర్శన ముగిసేవరకు పొట్టచెక్కలయ్యేలా నవ్వడమే పని. ఇక రెస్టారెంట్‌లో ఒకటేబుల్ వద్ద కూర్చున్న విద్యార్థి నటులు మా మిత్రుడుతో గొడవపడతారు. తాను మాత్రం నా కెందుకులే అని అక్కడే తింటూ కూర్చుంటాడు. ఇక మిగిలిన వారంతా ఒక్కకరుగా అతనిని రెచ్చగొట్టి గొడవ మరింత పెద్దది చేయాలని వారు ఆర్డర్ ఇచ్చి తెప్పించుకున్న ఆహార పదార్థాలు స్పూన్‌లోకి తీసుకుని మా మిత్రుడి కళ్ళకు చూయించడం అతన్ని తక్కువచేసి, ఎగతాలిగా వారిలో వారు నవ్వుకోవడం. అంతజరుగుతున్న మా మిత్రుడు అలానే సైలెంట్‌గా కూర్చొని తనపని తాను చేసుకోవడం. అయినా సరే, వారు ఇంకా ఇంకా రెచ్చగొట్టే ప్రయత్నంలో ఈసారి ఆహార పదార్థాలు ఒకొక్కటిగా నెత్తి మీద పోయడం. అబ్బ అక్కడ ఉన్నవారు అందరితో పాటు, మా మిత్రుడుతో నటిస్తున్నవారు కూడా నవ్వలేక, నవ్వలేక నటిస్తుంటే మా వాడి మొఖంలో అస్సలు నవ్వు ఛాయలు కనిపించలేదు. నిజంగా వీడికి అంత ఓర్పు–సహనం ఎక్కడ నుండి వచ్చింది అనేలా నటించాడు. మరి అది అరుల్ దాస్ మాస్టర్ డైరెక్షన్ కదా....! చివరికి మా వాడి మీద ఆహార పదార్థాలను విసిరినవారు, పోసినవారిలో.. ఒకొక్కరు మావాడి సహనం, ఓర్పు ముందు విసుగుతో అసహనంగా వెనుతిరిగి వెళ్ళడం తప్ప ఏమీ చేయలేకపోయారు. చివరికి ఆ పాత్రలో జీవించిన మా మిత్రుడు షేక్. ఖుద్దుష్ మాత్రం అక్కడ నుండి లేచి అటు–ఇటు చూసి సైలెంట్‌గా వెళ్ళిపోయాడు.

ఇలా అరుల్ దాస్ మాస్టర్ ఆలోచనలు అన్నీ విద్యార్థులను మంచి మార్గంలో నడిపించేలా ఉండేవి. చాలామంది ఏదైనా సమస్య వస్తే పదే... పదే... సమస్య పరిష్కారం ఎలా అని బుర్రలు బద్దలు కొట్టుకోవాల్సిన పనిలేదని ఆలోచించి మంచి నిర్ణయాలు తీసుకోవడం చాలా ఈజీ అని అరుల్ దాస్ మాస్టర్ మాకు చెప్పిన టిప్స్ ఇప్పటికి గుర్తున్నాయి. అవి ఇప్పుడు మాకు చాలా ఉపయోగకరమైనవిగానూ ఉన్నాయి. అరుల్ మాస్టర్ ఒక మంచి ఫోటోగ్రాఫర్ కూడా.... పాఠశాలలో ఏ కార్యక్రమాలు జరిగినా ఆయనే ఫోటోలు తీసేవారు. అరుల్ దాస్ మాస్టర్‌తో కలిసి బయట కొన్ని కార్యక్రమాలలో నేను ఫోటో గ్రాఫర్‌గా పనిచేశాను

**డాన్‌బోస్కో పూర్వ విద్యార్థుల సంఘం (మంగళగిరి)**

డాన్‌బోస్కో పూర్వ విద్యార్థులు సంఘం గురించి మనం ఇక్కడ ప్రత్యేకంగా చెప్పుకోవాలి. పునీత జాన్ బోస్కో గారి ఆశయాలు, ఫాధర్ థామస్ గారి ఆచరణీయ మార్గంలో మంగళగిరి డాన్‌బోస్కో పూర్వ విద్యార్థుల సంఘం ప్రేమ, దయ, సేవా గుణాలతోనే తన ప్రయాణం ప్రారంభించింది. పాఠశాల పూర్వ విద్యార్థి డాక్టర్ బిరుదు రవిబాబు ఆధ్వర్యంలో ఈ సంఘం సమాజానికి తనవంతు సాయంగా ఎన్నో సేవలు చేసింది. బిరుదు రవిబాబు ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు సంఘం కమిటీ సభ్యులు, డాన్‌బోస్కో పాఠశాల యాజమాన్యం, పూర్వ విద్యార్థులు సహకారంతో ఈ సంఘం చాలా విలువైన సేవలు అందించింది. 2019 కరోనా సమయంలో డాన్‌బోస్కో పూర్వ విద్యార్థులు సంఘం సేవలు ఏ మాత్రం వెల కట్టలేనివి.

కరోనా కాలం ప్రపంచాన్ని గడ గడ లాడిస్తుంటే ప్రజలు దిక్కులేని మరణాలు చెందారు. ఇంటినుండి బయటకు రాలేక ఆకలితో అల్లాడిపోయారు. కూలీ పనులు చేసుకునే కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పిలిచేవారు, తలచుకున్నవారు లేరు.

పరిస్థితులు ఇలా ఉంటే తాను చేయగలిగిన సాయం చేయాలని అప్పుడే ఈ డాన్‌బోస్కో పూర్వ విద్యార్థుల సంఘం ముందడుగు వేసింది. డాన్‌బోస్కో చుట్టుపక్కల గ్రామాలలో కరోనా కాలపు సేవలు బాధ్యతగా నిర్వహించారు. పాఠశాలలో మెడికల్ క్యాంపు, ఆయా కుటుంబాలకు ఆర్థిక సాయం, పనిచేస్తేనే రోజు గడుస్తుంది అనే వారికి కొద్ది రోజులపాటు నిత్యావసర వస్తువుల అందుచేత వంటి సహాయక చర్యలు జరిగాయి. మరి ముఖ్యంగా కనీసం మనుషులు చేయి-చేయి తాకరాదు, కాలుకూడా బయటపెట్టరాదు అనేంత ప్రచారం విస్తృతంగా జరుగుతున్న అనారోగ్యానికి గురైన వారిని సైతం ప్రత్యేక వాహనంలో చేతులపై మోసి ఆసుపత్రులకు తరలించిన దయా, సేవా గుణం కలిగిన సంఘంగా డాన్‌బోస్కో పూర్వ విద్యార్థులు సంఘం సేవలు కొనియాడబడ్డాయి. చివరికి 'కరోనా'తో మరణించిన వారి మృతదేహాలను మోసుకెళ్ళి ఖననం చేయడం, భూస్థాపన చేయడం వంటి కార్యక్రమాలు చేశారు.

ఇటీవల విజయవాడలో బుడమేరు కారణంగా వచ్చిన వరదలకు ఇబ్బందులు పడ్డ కుటుంబాలకు త్రాగునీటి బాటిల్స్, కొన్ని నిత్యావసర వస్తువులు, ఒక్కో కుటుంబానికి రెండేసి కూరగాయల బ్యాగులు పంచి డాన్‌బోస్కో పూర్వ విద్యార్థులు సంఘం తమ సేవాగుణాన్ని చాటారు. అలాగే బాగా చదువుకునే విద్యార్థులు అవసరాలను గ్రహించివారు నిరుపేదలుగా చదువుకునేందుకు ఇబ్బందులు పడితే వారికి అవసరమైన సదుపాయాలు కల్పించేవారు. అదే ఫీజుల విషయం సమస్య అయితే సంఘ సభ్యులే ఫీజులు చెల్లింపుచేసేవారు. ఏ సేవ చేసినా సేవాదృక్పథమే. ఈ విధమైన సేవలతో డాన్‌బోస్కో పూర్వ విద్యార్థుల సంఘం థామస్ ఫాథర్ ఆశయాలను చేయగలిగిన విధానంతో ముందుకు వెళుతుంది.

## ఈపూరి రాజారత్నం (జర్నలిస్ట్)



మనిషి చదువుకుని ఏం చేస్తున్న, ఏ హోదాలో ఉన్నా ప్రాథమిక, హైస్కూల్ స్థాయి విద్యకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. జ్ఞాన సముపార్జన, సామాజికస్పృహ, బాధ్యత మరియు విజ్ఞానం పెంచుకోవడం అనే విధానాలకు మూలం అనేది పాఠశాల స్థాయిలోనే పిల్లలకు అలవాటు చేయాలి. ఎవరైనా అల్లరి పిల్లలు కొంచెం ఎక్కువగా గొడవపెడితే ఇక వీళ్ళను బడిలో వేయాల్సిందే అంటారు కదా...! ఎందుకు, పిల్లలకు ఇక చదువుకునే సమయం వచ్చింది అని తల్లిదండ్రులు ఆలోచన. అందుకే పిల్లలకు క్రమశిక్షణ అలవరుచుకోవడానికి, ఆటపాటలతో చదువుకోవడానికి మంచి వేదిక పాఠశాల అని తల్లిదండ్రులు అభిప్రాయం.

ఇక ఈ పుస్తకరచయితగా మా ఫ్యామిలీకి ఒక ప్రత్యేకత ఉందని చెబుతున్నాను. మా ఫ్యామిలీలో అందరం ఒకే పాఠశాలలో చదువుకున్నాం అని తెలియజేసేందుకు మాకు చాలా గౌరవంగా ఉందని తెలిపేందుకు డాన్‌బోస్కో కుటుంబ సభ్యులుగా మన పాఠశాల విద్యార్థులుగా నా కుటుంబ సభ్యుల అభిప్రాయాలను ఇక్కడ పొందుపరచడం జరిగినది.

**Epuri RajaRatnam**

M.A, mjmc (Ph.D)

## ఈపూరి అనూరాధ



నేను డాన్‌బోస్కో పాఠశాలలో చదువుకోవడం చాలా అదృష్టం. అప్పట్లో మన డాన్‌బోస్కో స్కూల్‌కి చదువుకునేందుకు వెళ్ళడం చాలా ఆనందంగా ఉండేది. ఒక్కరోజు కూడా పాఠశాల మానుకోవడం అంటే అస్సలు ఇష్టం ఉండేది కాదు. ఆనాటి ఉపాధ్యాయుల విద్యా బోధన చాలా బాగుండేది. మరి ముఖ్యంగా పాఠశాలలో విచిత్రవేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు తోలుబొమ్మలు, మెజీషియన్ వంటి ప్రత్యేక కార్యక్రమాలు జరిగేవి. నేనైతే ఇవన్నీ మన పాఠశాలలోనే చూడటం జరిగింది. ఆటలు, పాటలు, డాన్సులు అన్నిటిలో పాల్గొని బహుమతులు అందుకోవడం అవును డాన్‌బోస్కో అంటే ఓ విజ్ఞాన ప్రపంచంలా ఉండేది.

నేను, మా అక్క, తమ్ముళ్ళుతో పాటు నా భర్త, పిల్లలు, మొత్తం అటు పుట్టినిల్లు, ఇటు మెట్టినిల్లు, మా ఫ్యామిలీ మొత్తం డాన్‌బోస్కో విద్యార్థులమే...! అవును అందరం ఇక్కడే చదువుకున్నాం. మరి ముఖ్యంగా పాఠశాల వాతావరణం నాకే కాదు ఎవరికైనా మానసిక ధైర్యాన్ని మరింతగా పెంచింది. కాకపోతే హైస్కూల్ విద్య అవకాశం లేకపోవడం కొంచెం బాధగా అనిపించింది. అందుకే ఎప్పుడైనా పాఠశాల ముందుగా ప్రయాణం చేస్తుంటే చిన్ననాటి పాఠశాల రోజులు గుర్తుకు వచ్చి 10వ తరగతి వరకు ఇక్కడే చదువుకునే అవకాశం మాకూ ఉన్నట్లయితే ఇంకా బాగుండేది కదా అనిపిస్తుంది.

**ఈపూరి అనూరాధ**

W/o **ఈపూరి రాజారత్నం**

(1992–1993)

## ఊపూరి రత్నాకర్ బాబు (ప్రభుత్వ టీచర్)



చదువుకున్న చదువు, దిద్దుకున్న అక్షరాలు మనల్ని ఒక లక్ష్యం దిశగా నడిపిస్తాయి అనేది నా జీవితంతో పాటు, మా అన్నదమ్ములు, మా పిల్లలు విషయంలో అక్షరసత్యంగా రుజువు కాబడింది. నేను మన పాఠశాలలో 6వ తరగతిలో చేరి 1985-86 విద్యా సవత్సరం 10వ తరగతి పూర్తి చేయడం జరిగింది. డాన్‌బోస్కో ప్రారంభం అయిన తరువాతనే మంగళగిరి పరిసర ప్రాంతాల్లో క్రైస్తవ మిషనరీ స్కూల్స్ ఏర్పడ్డాయి. మన పాఠశాలలో విద్య, క్రీడలు, క్రమశిక్షణ వంటి వాటికి అందరూ చెప్పినట్లే చాలా ప్రాధాన్యత ఉందనే దానికి నాతోపాటు ఎవరైనా ఏకీభవించక తప్పదు అనే విషయమే చాలా ప్రత్యేకమైనది.

ఇక్కడ చదువుకున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎంత అంకితభావంతో పనిచేస్తారు అనేది నా జీవితంలోనే ఋజువు కాబడింది. విద్యార్థులు ఏ సబ్జెక్టులో బలహీనంగా ఉన్నారని కనిపెట్టి అటువంటివారికి ప్రత్యేకంగా చదువు చెప్పడం జరిగింది. మరి ముఖ్యంగా లూర్థురాజు మాస్టర్ గారు పాఠశాల సమయం ముగిసినా మాస్టర్ మాత్రం అక్కడే వుండేవారు. తెలుగు, ఇంగ్లీషు మరికొన్ని సబ్జెక్టులను చదవడంలో వెనుకబడి ఉన్న విద్యార్థులను ప్రత్యేకంగా స్టాఫ్ రూమ్‌లో కూర్చోబెట్టి చాలా బాధ్యతగా చదువు చెప్పేవారు. అలా ఏకోపాధ్యాయుని పాఠశాలగా ఉన్న మన డాన్‌బోస్కోని ఎంతోమంది ప్రతిభావంతులను తయారుచేసే మంచి పాఠశాలగా నిలిపేందుకు మాస్టర్ గారి కృషి ఉంటే, పిల్లలను ఆధ్యాత్మిక తీరున, క్రమశిక్షణ దిశగా నడిపించిన థామస్ ఫాధర్ గారి సేవలు ఎంతో ప్రత్యేకమైనవి. ఇప్పుడు డాన్‌బోస్కో పాఠశాల 50 వసంతాల పండుగ చేయడం చాలా హర్షించదగిన విషయం. ఈ ప్రయాణంలో

ప్రత్యేక అంశాలను సువర్ణాక్షరాలతో లిఖించుకోదగిన హక్కు డాన్‌బోస్కో పాఠశాలకు అక్కడి ఉపాధ్యాయులకు మరి ముఖ్యంగా థామస్ ఫాధర్ గారికి తప్పకుండా ఉంటుందని నేను విశ్వసిస్తున్నాను.

ఇక డాన్‌బోస్కో పాఠశాలలో చదువుకున్న నేను నాకు చదువు చెప్పిన మన పాఠశాల టీచర్ల అంకితభావం చూసి నేను, నా సీనియర్లు, జూనియర్లు ఎంతోమంది టీచర్ ఉద్యోగాలలో ఉన్నాం. అలాగే డాన్‌బోస్కో సంస్థ ద్వారా ఫాధర్ థామస్ విద్యావ్యాప్తికి తీసుకున్న నిర్ణయం ఎప్పుడూ, ఏ విధంగానూ వృదాకాలేదు. అందుకు సాక్ష్యంగా స్థానికంగా చుట్టుప్రక్కల గ్రామాల నుండి ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఎంతోమంది టీచర్లు, పోలీసులు చాలావరకు సామాజిక రంగాలలోనే స్థిరపడ్డారు. డాన్‌బోస్కో మమ్మల్ని సమాజంలో గౌరవస్థానంలో నిలబెట్టి మా మనసులో ఎప్పటికి చెరగని ముద్ర వేసింది. దేశ, విదేశాలలోనూ ఉద్యోగాల రీత్యా ఉన్నవారు ఉన్నారు. డాన్‌బోస్కో అంటే ఒక సంస్థ మాత్రమే కాదు సామాజిక చరిత్ర అని నిరూపణ అయ్యింది. అలా ఈ పాఠశాల మాకు కేవలం విద్యాలయం మాత్రమే కాదు అది మా జీవితాలను నిలబెట్టిన దేవాలయం అని ఈ రోజున మేము అందరం గర్వంగా చెప్పుకుంటున్నాం.

**EPURI RATNAKAR BABU**
SA(BS), ZPHS.
Brahmanapalli,
Piduguralla Mdl.,
Palnadu Dt.,

## *Dr.* ఈపూరి శేషగిరి



నేను చిన్నతనంలో కొంచెం ఆకతాయి తనంతో ఉండేవాడిని. అప్పటికే మా ఫ్యామిలీ నుండి మా అన్నయ్యలు ఇద్దరు మన స్కూల్‌లోనే చదువుచున్నారు. మా అమ్మ ఆ రోజుల్లో నన్ను కూడా మన పాఠశాలలో చదివించాలి అని ఎంతో పట్టుదలతో ఉండేది. నాకైతే మా అమ్మగారి ప్రయత్నాల ద్వారా అడ్మిషన్ దొరకలేదు. చాలా బాధపడుతూ మైసూర్ పోస్టల్ గుమాస్తా ట్రైనింగ్ లో ఉన్న మా నాన్న గారికి అయ్యా పిల్లాడికి స్కూల్ లో అడ్మిషన్ దొరకలేదని ఉత్తరం రాయించింది.

దానితో మా నాన్నగారు మన పాఠశాలలో పోస్టుమాన్‌గా అప్పట్లో థామస్ ఫాధర్ గారితో ఉన్న పరిచయం వలన మా అబ్బాయికి (నాకు) అడ్మిషన్ కావాలి అని థామస్ ఫాధర్ గారికి ఉత్తరం రాశారు. అప్పుడు మా పెద్దన్నయ్యకు చెప్పి ఫాధర్ థామస్ మా అమ్మగారికి కబురు పెట్టి నన్ను స్కూల్ వద్దకు పిలిపించి మరీ...1వ తరగతి అడ్మిషన్ ఇచ్చారు.

ఆ రోజు స్కూల్‌లో చేరిన నేను చాలా అదృష్టవంతుడను. ఇక డాన్‌బోస్కో పాఠశాలలో నా జీవితం విద్య, క్రమశిక్షణ విషయంలో నా బాల్యాన్ని తీర్చిదిద్దింది. ఆ క్రమశిక్షణే నా జీవిత దిశను పూర్తిగా మార్చేసింది. ఫలితంగా నేను మూడు పీజీలు, బి.ఇడి., ఎం.ఫిల్. మరియు పి.హెచ్.డి. డిగ్రీలను సాధించాను. ఇది చూసి చాలామంది ఆశ్చర్యపోతారు. ఒకప్పుడు పాఠశాలకి అల్లరి చేయడానికి వెళ్లిన నేను, ఈ రోజు డాక్టరేట్ పొందిన వ్యక్తిగా మారాను అంటే దాని వెనుక ఉన్న ప్రధాన కారణం, నా పాఠశాల ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణే.

నేడు నేను సాధించిన ప్రతీ విజయం వెనుక నా పాఠశాల, నా ఉపాధ్యాయులు మరియు వారు నాలో నింపిన క్రమశిక్షణ ఉన్నాయి. ఆ క్రమశిక్షణే నా జీవితాన్ని మార్చిన నిజమైన శక్తి అని డాన్‌బోస్కో నాకు విద్యాలయం మరియు దేవాలయం అని గర్వంగా చెప్పగలను.

**Dr. Epuri Seshagiri**
M.A., M.A., M.A., B.Ed., M.Phil. Ph.D. (Edn)
NCSL-NIEPA, (Delhi), Consultant

# ఈపూరి రత్నశేఖర్



నేను మొదట మా ఇంటి సమీపంలో ఓ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో చదువుకునేవాడిని. కొన్ని పరిస్థితులు అనుకూలించక అక్కడ ఆగిపోయాను. అనంతరం మన పాఠశాలలో కూడా నాకు అడ్మిషన్ కష్టం అయ్యింది. ఒకటవ తరగతి అయినా అడ్మిషన్ సాధించడం ఏమంత ఈజీ కాదు. మా నాన్నగారు ఇక్కడ చదువుకున్నా నాకు అడ్మిషన్ చాలాకష్ట పడితే గానీ రాలేదు.

ఎట్టకేలకు నేను ఇక్కడ చేరిన మొదటి సంవత్సరమే అన్నిరకాల ఆటల్లో ఫస్ట్ రావడం చాలా ఆనందం కలిగింది. చాలామంది పాఠశాల ఫంక్షన్ వేళ నేను అందుకున్న బహుమతులు చూసి అబ్బా.... మీ అబ్బాయికి ఇన్ని బహుమతులా...! అని మా అమ్మ, మేనత్తతో అంటూ... మొత్తం బహుమతులు నీకేనరా, అని తెలిసినవారు అంటుంటే నాలో మానసిక ధైర్యం బాగా పెరిగింది.

అయితే నన్ను మా తాతయ్య, నాయనమ్మ ఇక్కడ 1వ తరగతిలో చేర్పించారు. నాకు క్రీడలు అంటే బాగా ఇష్టం ఉండేది. ఇక్కడ విద్య, క్రమశిక్షణ, క్రీడలతో పాటు విద్యార్థులలో మానసిక ధైర్యం ఎక్కువగా ఉండేలా ఉపాద్యాయులు శిక్షణ మెరుగ్గా ఉండేది. స్కూల్, క్లాసులు ఏమాత్రం ఇబ్బందిగా ఉండేవి కాదు. ప్రతిరోజు పాఠశాలకు వెళ్ళడం ఇంటివద్ద ఉండే దానికి మించి పాఠశాలలో ఎక్కువగా ఉండటం కారణం చేతనే జీవితంలో ఇప్పుడు మెరుగైన విధానంలో ఉన్నాను.

**ఈపూరి రత్నశేఖర్**

(2014–2015)

B.Sc., PGDCA, Praveena (Hin),
MTMC ( D.E.O.)

# ఈపూరి రాజశేఖర్



డాన్‌బోస్కో పాఠశాల నా జీవితాన్ని తీర్చిదిద్దిన అసలైన విద్యాలయం. ప్రభుత్వ-ఎయిడెడ్ పాఠశాలగా ఉన్నప్పటికీ, ఇక్కడ అందిన నాణ్యమైన విద్య, ఆచార్యుల నిబద్ధత మరియు పాఠశాల వాతావరణం అనేవి చాలా అద్భుతం. గురువుల నుంచి లభించిన ప్రేమ, మార్గనిర్దేశం నాకు చదువు మాత్రమే కాకుండా మంచి స్వభావం, క్రమశిక్షణ, ఆత్మ స్థైర్యం, ఆత్మాభిమానం, బాధ్యత వంటి విలువలను నేర్పాయి.

మన పాఠశాలలోని విశాలమైన గ్రౌండ్ శారీరక దృఢత్వాన్ని, టీమ్ వర్క్‌ను, పోటీ భావనను నాలో పెంచింది. ప్రతిరోజు పాఠశాలకు వెళ్లడం ఒక ఆనందం, ప్రతి తరగతి ఒక కొత్త పాఠం, ప్రతి అనుభవం ఒక జీవిత పాఠంగా మారింది. మన పాఠశాల నాకు విద్యను మాత్రమే కాదు, మంచి వ్యక్తిత్వాన్ని నిర్మించే బలమైన పునాదిని ఇచ్చింది.

నేడు నేను ఏ స్థాయిలో ఉన్నానో, ఆ ప్రయాణానికి ప్రారంభం అక్కడే. 2006-2016 పది సంవత్సరాలు మన పాఠశాల అధ్యయన కాలం నా జీవితంలో మరపురాని అధ్యాయం. మా అమ్మ-నాన్న మరియు అన్నయ్య ఫ్యామిలీ మొత్తం ఇక్కడే చదువుకున్నాం. ఇలా ఫ్యామిలీ మొత్తం ఒకచోట చదువుకోవడం అనేది నాకు, మా కుటుంబ సభ్యులకు చాలా సంతోషం కలిగిస్తుంది.

**ఈపూరి రాజశేఖర్**

A.P.C.P.D.C.L. (S.O)

# ఈపూరి రాజవర్ధన్



డాన్‌బోస్కో పాఠశాల అంటే క్రమశిక్షణ, క్రమశిక్షణ అంటే డాన్‌బోస్కోగా చెబుతారు. నా చిన్నప్పుడు మా అన్నయ్యలు ఇద్దరు డాన్‌బోస్కో పాఠశాలలో చదువుకునేందుకు వెళుతుంటే నేను కూడా పాఠశాలకు వెళతానని గొడవపెట్టేవాడిని, అయితే నాకు అప్పుడు స్కూల్‌కి వెళ్ళి చదువుకునే వయసులేని కారణంగా మన పాఠశాలపై, అక్కడ పరిస్థితులుపై మా అన్నయ్యల ద్వారా కొంత అవగాహన ఉండేది. అలా నాకు చదువుకునే వయసు రాగానే నేను కూడా డాన్‌బోస్కోలోనే చేరిపోయాను.

అలా ఇప్పుడు నాకు పాఠశాల అంటే చాలా కాలం క్రితం నుండి పరిచయం ఉన్నట్లు ఉంటుంది. ఇక పాఠశాలలో చదువుతో పాటు, కొత్త కొత్త క్రీడలు స్కూల్లో చేరిన తరువాతనే నేర్చుకోవడం జరిగింది. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యతనిస్తూ ఉన్న నాకు డాన్‌బోస్కో పాఠశాలలో చదువు, క్రమశిక్షణతో పాటు క్రీడలలో మాకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. ఉదయాన్నే మా పాఠశాల అని గర్వంగా గ్రౌండ్‌కి వెళ్ళడం అక్కడ పి.ఇ.టి, మాస్టర్ గారి ఆధ్వర్యంలో రన్నింగ్, జూడో కోసం ప్రత్యేక టీచర్ ఆధ్వర్యంలో శిక్షణ పొందడం మరింత ఉత్సాహంగా ఉంది. కావలసినంత గ్రౌండ్, ఎన్నో క్రీడా పరికరాలు, సదుపాయాలు ఉన్నాయి. ఇప్పుడు జరగబోయే గోల్డెన్ జూబ్లీ మాకు ఎంతో ఆనందంగా ఉంది.

**ఈపూరి రాజవర్ధన్**
డాన్‌బోస్కో పాఠశాల
8వ తరగతి
(2025–26)

## ఈపూరి రత్నాంజలి



డాన్‌బోస్కో పాఠశాలలో ఇప్పుడు నేను తెలుగు మీడియంలో 6వ తరగతి చదువుచున్నాను. మా పాఠశాల అంటే నాకు చాలా ఇష్టం. ఇక్కడ మాకు విద్యతో పాటు గ్రంధాలయం, సైన్స్ ల్యాబ్, ఆడుకునేందుకు విశాలమైన ఆటల గ్రౌండ్, పార్కులో జారుడుబండ, ఉయ్యాలలు, రంగులరాట్నం వంటివి ఉన్నాయి. సాయంత్రం స్కూలు వదిలాక ఫ్రెండ్స్ అందరు సరదాగా ఆడుకుంటాం. ఇలా స్కూల్లో ఆడుకోవడం మాకు చాలా ఆనందం.

మా టీచర్లు మాకు అన్ని సబ్జెక్టుల పాఠాలు అర్ధమయ్యేలా చెబుతారు. మా నాన్నగారు, పెదనాన్నలు, అన్నయ్యలు అందరు మన స్కూలోనే చదువుకున్నారు. ప్రస్తుతం మా అన్నయ్య, నేను ఇక్కడే చదువుచున్నాం. నాకు పాఠశాలలో మంచి స్నేహితులు ఉన్నారు. అందరం కలిసి ఆడుకుంటాం, చదువుకోవడం చేస్తాం. మధ్యాహ్న సమయంలో లైబ్రరీలో నీతి కథలు, కథల పుస్తకాలు చదువుకుంటాం. ఇప్పుడు మా పాఠశాలలో గోల్డెన్ జూబ్లీ పండుగ జరుగుతుంది. ఈ పండుగ లో మేము కూడా ఈ పండుగలో పాల్గొనే అవకాశం రావడం మా అదృష్టంగా భావిస్తున్నాం.

**ఈపూరి రత్నాంజలి**
డాన్‌బోస్కో పాఠశాల
6వ తరగతి
(2025-26)




డాన్‌బోస్కో ప్రేమ్‌నివాస్ హాస్టల్ బిల్డింగ్ ప్రారంభోత్సవ సమయంలో
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ గవర్నర్
కీ॥శే॥ కె.సి. అబ్రహాం గారు (ఫైల్ ఫోటో)



ఫా॥ థామస్ గారితో డాన్‌బోస్కో అధ్యాపకులు, విదార్థులు (ఫైల్ ఫోటో)



డాన్‌బోస్కో ప్రేమ్‌నివాస్ పూర్వ విద్యార్ధుల ఆధ్వర్యంలో
ఫా॥ థామస్ గారికి ఘన సన్మానం.



డాన్‌బోస్కో ప్రేమ్‌నివాస్ పూర్వ విద్యార్ధులు



ఫా॥ థామస్ గారితో డాన్‌బోస్కో సభ్యులు



ఫా॥ థామస్ గారితో డాన్‌బోస్కో ప్రేమ్‌నివాస్ విద్యార్థులు



రచయిత ప్రొఫైల్ :

**ఈపూరి రాజారత్నం**

M.A., (Ph.D.) in Journalism

తల్లిదండ్రులు : ఈపూరి ఫిలేమోన్ (సబ్ - పోస్టుమాస్టర్)
" సరోజిని దేవి

భార్య : అనూరాధ


కుమారులు : రత్నశేఖర్, రాజశేఖర్

☆ వృత్తి : ఫ్రీలాన్స్ జర్నలిస్టు, తెలుగు కంటెంట్ రైటర్

☆ అనుభవాలు : ఫోటోగ్రఫీలో 8 సం॥రాలు.
జర్నలిజంలో 20 సం॥రాలుగా .....

☆ అభిరుచులు : ఫోటోగ్రఫీ, సాహిత్య రచనలు మరియు వాటి ఆకళింపు

☆ అవార్డులు :
- పద్మశ్రీ ఐ.వి సుబ్బారావు రైతునేస్తం అవార్డు.
- ఉత్తమ జర్నలిస్టుగా ఉగాది పురస్కారం.
- అంతర్జాతీయ సంస్థ డాన్‌బోస్కో సేవా అవార్డు.
- ఐ.బి.యన్. భవన్ ప్రెస్‌క్లబ్ సత్కారం.
- మంగళగిరి పుర ప్రముఖుల సత్కారం.



తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాజీ ఉప-రాష్ట్రపతి శ్రీ వెంకయ్యనాయుడు గారి చేతుల మీదుగా ఉత్తమ జర్నలిస్టుగా ఉగాది పురస్కారం అందుకొంటున్న సీనియర్ జర్నలిస్టు ఈపూరి రాజారత్నం. (02-05-2023)